IYYALATELANGANA

# ఇయ్యాల తెలంగాణ

మన భాష – మన యాస

iyyalatelangana.com facebook.com/iyyalatelangana twitter.com/iyyalatelangana printerest./iyyalatelangana

హైదరాబాద్ ఆదివారం 13-09-2026 సంపుటి :13 సంచిక :45 పేజీలు 8 వెల. రూ॥ 4 /-

## బ్రిక్స్ కూటమి ఎవరికీ వ్యతిరేకం కాదు: ప్రధాని మోదీ



సెప్టెంబర్ 12: ఢిల్లీ వేదికగా జరుగుతున్న 18వ బ్రిక్స్ సదస్సు ప్రారంభ సమావేశంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రసంగం చేశారు. బ్రిక్స్ కూటమి ఏ రకమైన పాశ్చాత్య లేదా ఇతర వర్గానికి వ్యతిరేకంగా పనిచేసే వేదిక కాదని, అందరినీ కలుపుకొనిపోయే భాగస్వామ్య వేదిక అని ప్రధాని స్పష్టం చేశారు. భారత్ బ్రిక్స్ అధ్యక్షత వహించడంలో 'మానవాభివృద్ధే కీలకం' అనే నమూనాను అనుసరిస్తోందన్నారు. మారుతున్న గ్లోబల్ పరిణామాలకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఇతర ప్రపంచ సంస్థలలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని మోదీ పిలుపునిచ్చారు. గ్లోబల్ సౌత్ (అభివృద్ధి చెందుతున్న దేశాల) స్వరాన్ని మరింత బలపరచాలని కోరారు. బ్రిక్స్ ప్రారంభమై రెండు దశాబ్దాలు పూర్తిచేసుకున్న సందర్భంలో, కూటమి సాధించిన ఏకాభిప్రాయాన్ని కేవలం మాటలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో స్పష్టమైన ఫలితాలు సాధించే దిశగా తీసుకెళ్లాలని మోదీ సూచించారు. అన్ని నిర్ణయాలు, కార్యక్రమాలు సజావుగా ముందుకు సాగేందుకు బ్రిక్స్ లోపల ఒక ప్రత్యేక 'కంటిన్యూటీ అండ్ ఇంప్లిమెంటేషన్ మెకానిజం' ఏర్పాటు చేయాలని మోదీ ప్రతిపాదించారు.

## గణేశ్ ఉత్సవాలకు ఎలాంటి ఆటంకం కలగకూడదు: సీఎం రేవంత్ ఆదేశం..



హైదరాబాద్: భాగ్యనగరంలో గణేశ్ ఉత్సవాలకు ఎలాంటి ఆటంకం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పండుగ వేళ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు ఏ చిన్న ఇబ్బంది కలగకుండా సహాయ సహకారాలు అందించాలన్నారు. హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవాలపై శాసన మండలి కాన్ఫరెన్స్ హాల్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్, జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ, హైడ్రా కమిషనర్, పోలీసు ఉన్నతాధికారులు, అధికారులు, గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. మండప నిర్వాహకులు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలి. ఎక్కడెక్కడ మండపాలు ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే సమాచారం అందిస్తే పోలీసులకు ట్రాఫిక్, బందోబస్తు నిర్వహణకు సులభంగా ఉంటుంది. మీ సమస్యలు తెలుసుకునేందుకు స్వయంగా నేనే సమీక్ష నిర్వహిస్తున్నా. నిర్వాహకులు మండపాలకు అతిథులను ఆహ్వానిస్తే ఆ వివరాలను స్థానిక కమిషనరేట్‌కు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నా. ఊహించని పరిణామాలు జరిగినప్పుడు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు ఆ సమాచారం ఉపయోగపడుతుంది. నగరంలో అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద గణేశ్ నిమజ్జనాలకు అనుగుణంగా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి. చెరువుల వద్ద చుట్టూ క్రేన్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలి. ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీసు శాఖలు నిరంతర పర్యవేక్షణ చేయాలి. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలి. పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలి. హైదరాబాద్ ప్రశాంతంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయి. పండుగ వేళ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత్త వహించాలి. ఇందుకు నిర్వాహకుల నుంచి సహకారం ఉండాలి. సమస్యలు ఏమున్నా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని పేర్కొన్నారు.

## కీలక పరిణామం.. కొండా సురేఖకు అధిష్ఠానం నుంచి పిలుపు

వరంగల్, సెప్టెంబర్ 12: మంత్రి పదవి నుంచి బర్తరఫ్ అయిన కొండా సురేఖకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. ఢిల్లీకి వెంటనే రావాలని ఆమెకు అధిష్ఠానం పెద్దల నుంచి సందేశం అందింది. మంత్రి పదవి కోల్పోయిన కొండా సురేఖతో తెలంగాణ పార్టీ వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్ స్వయంగా మాట్లాడారు. కొండా సురేఖకు కేబినెట్ స్థాయి పదవి ఇచ్చే యోచనలో పార్టీ అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తుందివరంగల్ జిల్లాలోని



గీసుకొండలో కొండా సురేఖ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె కుమార్తె సుస్మిత పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు పరకాల అసెంబ్లీ స్థానంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో పార్టీ క్రమశిక్షణ కమిటీ కొండా సురేఖను వివరణ కోరింది. ఈ సందర్భంగా కమిటీకి ఆమె రెండు లేఖలు రాశారు. ఈ వ్యవహారంపై క్రమశిక్షణ కమిటీ.. పీసీసీ చీఫ్‌కు నివేదిక అందించింది. ఈ నివేదికను పార్టీ అధిష్ఠానానికి తెలంగాణ పీసీసీ చీఫ్ అందించారు. ఈ నివేదిక ఆధారంగా ఆమెపై చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆమెను మంత్రి పదవి నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేశారు. అయితే తాను ఎమ్మెల్యేగా కొనసాగుతానని స్పష్టం చేశారు. నిత్యం ప్రజల మధ్య ఉంటానని పేర్కొన్నారు. మరో వైపు ఫేస్‌బుక్ వేదికగా 'బిగ్ అప్డేట్ కమింగ్ సూన్' అంటూ ఆమె పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది.

## 'న్యూఢిల్లీ డిక్లరేషన్'కు బ్రిక్స్ కూటమి ఏకగ్రీవ ఆమోదం

ఢిల్లీ, సెప్టెంబర్ 12: బ్రిక్స్ సదస్సులో చారిత్రక ఘట్టం నమోదైంది. సదస్సులో భాగంగా రూపొందించిన 'న్యూఢిల్లీ డిక్లరేషన్' కు కూటమిలోని సభ్య దేశాలన్నీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతున్న పశ్చిమాసియా సంక్షోభంపైనా సభ్య దేశాల మధ్య స్పష్టమైన ఏకాభిప్రాయం వ్యక్తమైంది. పశ్చిమాసియా పరిణామాలపై బ్రిక్స్ కూటమి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, ఏ రకమైన సమస్యకూ యుద్ధం పరిష్కారం కాదని స్పష్టం చేసింది. శాంతిని నెలకొల్పడానికి నిరంతర చర్చలు, దౌత్య మార్గాలే ఏకైక పరిష్కారమని సభ్య దేశాలు తేల్చిచెప్పాయి.

'న్యూఢిల్లీ డిక్లరేషన్'లోని ముఖ్యాంశాలు

1. పశ్చిమాసియా సంక్షోభం- శాంతి: పశ్చిమాసియా సంక్షోభం సహా ఎలాంటి అంతర్జాతీయ సమస్యలకైనా యుద్ధం పరిష్కారం కాదని, దౌత్య మార్గాలు, చర్చల ద్వారానే శాంతి సాధ్యమని స్పష్టం చేశారు. ఏకపక్ష యుద్ధ చర్యలను ఖండిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

2. ఐరాస సంస్కరణలు: మారుతున్న, వర్తమాన ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

3. మానవాభివృద్ధే ప్రాధాన్యం: భారత్ నేతృత్వంలో ఈ సదస్సు (మానవాభివృద్ధే ప్రథమం) ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని తీర్మానించారు.

4. ఆర్థిక సవాళ్లు, డిజిటల్ సహకారం: ప్రపంచ సరఫరా వ్యవస్థలను బలపరచడం, ఆహార-ఇంధన భద్రత, స్థానిక కరెన్సీల ద్వారా వ్యాపారాన్ని




పెంపొందించడం వంటి ఆర్థిక అంశాలపై ఏకాభిప్రాయం వ్యక్తమైంది.

సదస్సును ఉద్దేశించి భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ, బ్రిక్స్ కూటమి ప్రయాణంలో ఇది కీలక ఘట్టమని పేర్కొన్నారు. బ్రిక్స్ కూటమి ఏర్పడి రెండు దశాబ్దాలు పూర్తయిన సందర్భంలో, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సభ్య దేశాల ప్రజలకు విశ్వాసం, భరోసా కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రపంచ సమస్యలకు పరిష్కారం: అంతర్జాతీయ వేదికలపై ఎదురవుతున్న వివిధ సమస్యలు, సవాళ్లకు బ్రిక్స్ దేశాలు ముందుండి కార్యాచరణ ద్వారా పరిష్కారం చూపించాలని పిలుపునిచ్చారు. బ్రిక్స్ కూటమి వేగంగా అభివృద్ధి చెందాలని కోరుకుంటూనే, మనం వేసే ప్రతి అడుగులో మానవాభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని భారత ప్రధాని నొక్కిచెప్పారు.ాస భద్రతా మండలి సంస్కరణలు: మారుతున్న వర్తమాన ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి (ఐరా) భద్రతా మండలిలో తక్షణమే సమగ్ర సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు ఆమోదం లభించడం ద్వారా అంతర్జాతీయ వేదికపై బ్రిక్స్ కూటమి ఏకతాటిపై నిలిచిందని, ప్రపంచ శాంతి, అభివృద్ధి దిశగా బలమైన అడుగులు వేస్తోందని స్పష్టమవుతోంది.

## కేసీఆర్ హయాంలోని భూ అక్రమాలను అసెంబ్లీ ముందు ఉంచుతాం: పొంగులేటి



హైదరాబాద్, సెప్టెంబర్ 12 :కేసీఆర్ హయాంలో తెలంగాణలో పేదలకు అందాల్సిన ఆస్తులపై కన్నేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఆ భూములను కొల్లగొట్టేందుకు మాస్టర్ స్కెచ్ వేశారని పేర్కొన్నారు. 22ఏ సంబంధిత భూముల సమస్యలపై అసెంబ్లీలో లఘు చర్చను మంత్రి పొంగులేటి ప్రారంభించారు. ఆ మాస్టర్ స్కెచ్‌లో భాగమే ధరణిని తీసుకువచ్చారని ఆరోపించారు. ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా ధరణిని తీసుకొచ్చారని అన్నారు. నలుగురు వ్యక్తులు నాలుగు గోడల మధ్య అర్ధరాత్రి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ధరణి వచ్చాక పేదలు అనేక కష్టాలు, ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ధరణి నిర్వహణ కాంట్రాక్ట్‌ను కూడా తమకు అనుకూలమైన సంస్థకే ఇచ్చారని మంత్రి పొంగులేటి చెప్పారు. తెలంగాణ భూములను విదేశీ సంస్థలకు తాకట్టు పెట్టిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని ఆరోపించారు. తాకట్టు పెట్టిన భూములను మరో సంస్థకు బదిలీ చేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ భూములను సొంత ఆస్తుల్లా ఇష్టానుసారంగా రిజిస్ట్రేషన్లు చేశారని అన్నారు. కేసీఆర్ హయాంలోని అక్రమాలన్నింటినీ ఒక్కొక్కటిగా తాము సభ ముందు ఉంచుతామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌లో ఉన్న నాయకులు.. మాజీ మంత్రులు.. ఎమ్మెల్యేలు కూడా ధరణిపై మాట్లాడారని చెప్పారు. ప్రభుత్వం మంచి చేస్తే మంచి చేయాలని.. కానీ విషం చిమ్మే సంస్కృతి సరికాదని పేర్కొన్నారు. 'పేదల భూములను దోచుకునేందుకే ధరణిని తీసుకొచ్చారు. తప్పు చేసినోడు తల వంచుకుంటారని.. పాపం చేసినోడు పారిపోతారు. ఈరోజు శాసనసభ సాక్షిగా అదే అక్షరాలా నిజమైంది. ఈ భూములపై చర్చకు ముఖం చాటేయడం బీఆర్ఎస్ నేతలకు కొత్తేమీ కాదు. సభలో గందరగోళం సృష్టించి ఉద్దేశపూర్వకంగానే పారిపోయారు. కేసీఆర్ హయాంలో రెవెన్యూ శాఖలో భారీ స్కాం చేశారు. అడ్డగోలుగా నొక్కేసిన భూముల లెక్కలు చిన్నవి కాదు. బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి పారిపోవచ్చు.. కానీ నాలుగు కోట్ల ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత మా ప్రభుత్వంపై ఉంది. తెలంగాణ కోసం అనేక మంది యువత ఆత్మబలిదానాలు చేశారు. యూపీఏ ప్రభుత్వం.. సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను ప్రజలు ఎన్నుకున్నారు. పేదలకు పూర్తి హక్కులు వస్తాయని ప్రజలు కలలు కన్నారని.. కానీ తెలంగాణను వారి స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారు. వారి ఆస్తులు.. బంధువుల ఆస్తులు పెంచుకునేందుకే తెలంగాణను వాడుకున్నారు. భూముల విషయంలో ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగింది. రెవెన్యూ శాఖ మొత్తం అప్పటి ముఖ్యమంత్రి కన్నుసైగల్లోనే నడిచింది. రెండోసారి కూడా రెవెన్యూ శాఖను కేసీఆర్ తన వద్దే ఉంచుకున్నారు' అని మంత్రి పొంగులేటి ధ్వజమెత్తారు. 'భారతీయ సంస్కృతిలో మట్టికి?మనిషికి విడదీయరాని బంధం ఉంది. భూమి కేవలం ఆస్తి కాదని.. రైతు చెమటకు ప్రతీక. కుటుంబ భవిష్యత్తుకు భూమే భరోసా.. ఆత్మగౌరవానికి నిలువెత్తు సాక్ష్యం.

## ఆదిలాబాద్ విమానాశ్రయం ఏర్పాటుకు అడుగులు వేగంగా పడుతున్నాయి: కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ: వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఆదిలాబాద్ ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటుకు అడుగులు వేగంగా పడుతున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈ అంశంపై ఇవాళ (శనివారం) కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో సమావేశమైనట్లు తెలిపారు. ఈ భేటీలో ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పురోగతిపై సమీక్షించినట్లు కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టు అమలును వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. దీనికి సంబంధించిన కార్యాచరణను మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వం నుంచి ఒక్కో నోడల్ అధికారిని వచ్చే వారంలోగా నియమించాలని



నిర్ణయించినట్లు తెలిపారు. జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్‌కు డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పనను వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఉత్తర తెలంగాణ కనెక్టివిటీకి సంబంధించి విమానాశ్రయం, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఏర్పాటు అవసరాన్ని కేంద్ర మంత్రులకు వివరించినట్లు తెలిపారు. రీజినల్ కనెక్టివిటీని మెరుగుపరచాల్సిన అంశాన్నీ వారి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ మేరకు ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ (ఏజం)ను అభివృద్ధి చేసేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ సిద్ధంగా ఉందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారన్నారు. అలాగే ఇందుకు అవసరమైన సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని ఆయన హామీ ఇచ్చారని కిషన్ రెడ్డి తెలిపారు. మరోవైపు, ఈ విమానాశ్రయం కోసం ఏళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు.. వరుస సమావేశాలు, లేఖలు, నిరంతర సమన్వయం నేడు తుది దశకు చేరుకోవడం సంతోషంగా ఉందని ఆయన చెప్పుకొచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష సాకారమయ్యే దిశగా కీలక ముందడుగు పడిందని కేంద్ర మంత్రి హర్షం వ్యక్తం చేశారు.

IYYALATELANGANA
ఇయ్యాల తెలంగాణ
మన భాష – మన యాస

# సంపాదకీయం

## ప్రైవేటీకరణ వివాదంలో ఇస్రో

ఇస్రో ప్రైవేటీకరణ అంశం చుట్టూ వివాదం రాజుకుంది.ఇస్రో ప్రైవేటీకరణ అంశంపై స్పష్టత ఇవ్వాలంటూ ఆ సంస్థకు చెందిన తొమ్మిది ఉద్యోగ సంఘాలు చైర్మన్‌కు లేఖ రాయడం ఈ అంశంపై చర్చకు దారితీసింది.అయితే, ఈ ప్రైవేటీకరణ అంశం 'నిరాధారమైనది' అని ఇస్రో చెబుతోంది.ఇదే విషయంపై ఇండియన్ నేషనల్ – స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ చైర్మన్ పవన్ కుమార్ గోయెంకా 'ఎక్స్'లో స్పందించారు.'భారత అంతరిక్ష రంగానికి ఇస్రో మూల స్తంభంగా ఉంటుంది" అని ఆయన చెప్పారు.న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్) తరఫున ఇస్రో తయారు చేసిన ఎన్నో సాంకేతికతలు వాణిజ్య అవసరాలకు వాడుకునేందుకు స్టార్టప్‌లకు బదిలీ అయ్యాయని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో అధికారిక సమాచారం ప్రకారం తెలుస్తోంది.అయితే, ప్రైవేటు సంస్థల కారణంగా భారత అంతరిక్ష రంగం అభివృద్ధికి ఊతం ఇచ్చినట్లవుతోందని స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ కో-ఫౌండర్ పవన్ కుమార్ చెప్పారు.సెప్టెంబరు 5న జీఎస్ఎల్వీ ద్వారా ఇస్రో జియో ఇమేజింగ్ శాటిలైట్స్‌ను ప్రయోగించింది. ఈ ప్రయోగం విజయవంతమైనట్లు ప్రకటించింది.ఇది జరిగిన కొన్ని గంటల తర్వాత ఇస్రోలోని తొమ్మిది ఉద్యోగ సంఘాలు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్‌కు బహిరంగ లేఖ రాశాయి.ప్రైవేటీకరణ, భవిష్యత్తులో ఇస్రో పాత్ర తదితర అంశాలను ప్రస్తావిస్తూ లేఖను విడుదల చేశారు ఉద్యోగులు.ఉద్యోగ సంఘాల తరఫున ఇస్రోలోని 5వేల మంది ఉద్యోగులకు తాము ప్రాతినిధ్యం వహిస్తున్నామని, మొత్తం 18,100 మంది ఉద్యోగులలో తమ సంఘాల ప్రతినిధులు 27శాతం మంది ఉన్నారని అందులో ప్రస్తావించారు.అసలు ఈ వివాదానికి ఆగస్టులో ఇన్-స్పేస్ చైర్మన్ పవన్ గోయెంకా చేసిన వ్యాఖ్యలు కీలకంగా మారాయి.రానున్న రోజుల్లో రాకెట్లు (లాంచ్ వెహికల్స్)ను ఇస్రో స్వయంగా తయారు చేయదు. వాటి తయారీ బాధ్యత ప్రైవేటు సంస్థలు లేదా ప్రభుత్వ రంగ సంస్థలకే అప్పగిస్తాం. ఇప్పటికే ఎస్ఎస్ఎల్వీ ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలోనే తయారువుతోంది.రోజువారీ ప్రయోగాలకు ఉపయోగించే లాంచ్ వెహికల్స్ కాకుండా ప్రత్యేక సందర్భాలు, పరిశోధనలు, ప్రత్యేక కక్ష్యలో ప్రవేశపెట్టే రాకెట్లను తయారు చేసే సాంకేతికతపై ఇస్రో దృష్టి పెడుతుంది. ఆ తర్వాత ఆ టెక్నాలజీని కూడా ప్రైవేటు రంగానికి బదిలీ చేస్తుంది" అని పవన్ గోయెంకా చెప్పారు.ఇప్పటికే 120 రకాల టెక్నాలజీలను ప్రైవేటు సెక్టార్‌కు బదిలీ చేశామని చెప్పారు పవన్ గోయెంకా.ఈ వ్యాఖ్యలు భారత అంతరిక్ష రంగంలో పెద్దఎత్తున చర్చకు దారి తీశాయి ఇస్రోను ప్రైవేటీకరిస్తారని లేదా దాని పాత్రను తగ్గించే ప్రయత్నం జరుగుతోందనే ఊహాగానాలు, తప్పుదోవ పట్టించే సమాచారం ప్రచారం జరుగుతోంది. ఇది పూర్తిగా తప్పు, నిరాధారం" అని ఇస్రో చెప్పింది.అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని పెంచడమంటే ఇస్రో పాత్రను తగ్గించడం కాదని సంస్థ స్పష్టం చేసింది."భారత అంతరిక్ష రంగానికి నెక్స్ట్ జనరేషన్ సాంకేతికతల వృద్ధిపై ఇస్రోకు వీలు కల్పించాలన్నదే దీని ప్రధాన ఉద్దేశం" అని చెప్పింది.అంతరిక్ష రంగంలో భారత్ అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ప్రైవేటు రంగం కీలకమని స్కైరూట్ ఏరోస్పేస్ కో ఫౌండర్ పవన్ కుమార్ చందన చెప్పారు.భారత తొలి ప్రైవేటు ఆర్బిటాల్ రాకెట్ 'విక్రమ్ -1'ను స్కైరూట్ ఏరోస్పేస్ ఇటీవలే విజయవంతంగా ప్రయోగించింది."ఇస్రో, ప్రైవేటు స్పేస్ సెక్టార్‌లను కలిపే చూడాలి. అందులో ఇస్రో కీలకమైనది. ప్రైవేటు సెక్టార్ కంపెనీలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. ఈ రెండూ కలిస్తేనే భారత అంతరిక్ష రంగం ముందుకు సాగుతుంది" అని ఆయన చెప్పారు.కేంద్ర ప్రభుత్వం 2023లో 'ఇండియన్ స్పేస్ పాలసీ' తీసుకువచ్చింది. 2024 ఫిబ్రవరిలో స్పేస్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు కేంద్ర ప్రభుత్వం అనుమతించింది.ఆ తర్వాత అంతరిక్ష రంగంలో స్టార్టప్‌లు పెద్దఎత్తున వచ్చాయి. ప్రైవేటు కంపెనీల నియంత్రణ, ప్రోత్సాహకానికి ఇన్-స్పేస్ పనిచేస్తుంది.భారత్‌లో 2033 నాటికి స్పేస్ ఎకానమీ (అంతరిక్ష రంగ ఆర్థిక వ్యవస్థ) 45 బిలియన్ డాలర్ల (సుమారు 4,248,000 కోట్లు)కు చేరుకుంటుందని అంచనా. ఇందులో 11 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 1,038,000 కోట్లు )విలువైన ఎగుమతులు ఉంటాయని భారత్ అంచనా వేస్తోంది.ఈ ఏడాది జులై నాటికి భారత్ స్పేస్ ఏకానమీ సుమారు 8.4 బిలియన్ డాలర్లుగా ఉందని పీఐబీ వెల్లడించింది.2014లో ఒకే ఒక్క స్పేస్ టెక్నాలజీ స్టార్టప్ ఉండగా ఈ ఏడాది మార్చి 31 నాటికి భారత స్టార్టప్‌లలో పెట్టుబడులు 618.5 మిలియన్ యూఎస్ డాలర్లకు (సుమారు రూ. 58,340 కోట్లు) చేరుకున్నాయి.2021-22 లో ఈ పెట్టుబడులు 100.5 మిలియన్ డాలర్లు( సుమారు రూ. 9,480 కోట్లు) ఉండగా.. ఈ ఏడాది మార్చి నాటికి ఆరు రెట్లు పెరిగాయి.ఈ ఆగస్టు నాటికి భారత్‌లో 440 స్పేస్ టెక్నాలజీ స్టార్టప్‌లు రిజిస్టర్ అయినట్లు డీపీఐఐటీ స్టార్టప్ ఇండియా పోర్టల్ లెక్కలు చెబుతున్నాయని పీఐబీ రిపోర్టు చేసింది.ప్రస్తుతం భారత్‌లో ఉన్న స్పేస్ టెక్నాలజీ స్టార్టప్‌లలో 18 స్టార్టప్‌లతో పాటు 52 ప్రభుత్వేతర సంస్థలకు కలిపి అంతరిక్ష రంగ కార్యకలాపాలు నిర్వహించేందుకు 113 ఆథరైజేషన్స్ దక్కాయి."ప్రైవేటు సెక్టార్ పురోగతి అనేది భారత అంతరిక్ష రంగానికి 'బూస్ట్' అవుతుంది. వేలాది ఉద్యోగాలు వస్తాయి. గత మూడేళ్లలో 5వేల ఉద్యోగాలు రాగా, బిలియన్ డాలర్ల పెట్టుబడులు ప్రైవేటు స్పేస్ రంగంలోకి వచ్చాయని గణంకాలు స్పష్టం చేస్తున్నాయి" అని బీబీసీతో పవన్ కుమార్ చందన చెప్పారు.ఇస్రో వినియోగిస్తున్న యంత్రాలలో 80శాతం భాగాలు ప్రైవేటు కంపెనీలే తయారు చేస్తున్నాయని చెప్పారు పవన్ కుమార్ చందన.ఎస్ఎస్ఎల్వీ సాంకేతికతను 2025 సెప్టెంబరు 10న హెచ్ఏఎల్‌కు ఇస్రో, న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్), ఇన్-స్పేస్ సంయుక్తంగా బదలాయించాయి.

# వేలాది బైక్‌లతో బాలాపూర్ నుంచి చార్మినార్ వరకు భారీ ర్యాలీ

తెలంగాణ విమోచన దినోత్సవ విశిష్టతను ప్రతి ఒక్కరికీ తెలియాలి:ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

అందెల శ్రీరాములు ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన జైత్రయాత్రబాలాపూర్ శివాజీ చౌక్ నుంచి

చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి ఆలయం వరకు వేలాది మంది బైక్‌లతో భారీ ర్యాలీ









ఇయ్యాల తెలంగాణ: తెలంగాణ చరిత్రను నేటి యువతరానికి తెలిసే విధంగా కార్యక్రమాలు నిర్వహించవలసిన అవసరం ఉందని చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ అందెల శ్రీరాములు ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన జైత్రయాత్రను బైక్ ర్యాలీ ప్రారంభించారు. బాలాపూర్ శివాజీ చౌక్ నుంచి చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి ఆలయం వరకు వేలాది మంది బైక్‌లతో భారీ ర్యాలీగా తరలివెళ్లారు. ముఖ్య అతిథులుగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ దేశభక్తి నినాదాలతో ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు దేశ ఐక్యత, జాతీయ సమైక్యత, సంఘటిత శక్తిని నేటి యువతలో నింపవలసిన అవసరం ఉందన్నారు. తెలంగాణ విమోచన పోరాట చరిత్రను నేటి యువతకు, భావితరాలకు తెలియజేయాలనే ప్రధాన ఉద్దేశంతో ఈ జైత్రయాత్రను నిర్వహించినట్లు అందెల శ్రీరాములు పేర్కొన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవ విశిష్టతను ప్రతి ఒక్కరికీ తెలియజేయడంతో పాటు, హైదరాబాద్ ను భారతదేశంలో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని భావితరాలకు గుర్తుచేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఇంటెల్లెక్టువల్ సెల్ కన్వీనర్ గంగాపురం వెంకటరెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు బొక్కా నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు నిరంజన్ యాదవ్, గోల్కొండ జిల్లా అధ్యక్షులు ఉమా మహేందర్, రాజేంద్రనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. బీజేపీ నాయకులు, బీజేవైఎం నాయకులు, హిందూ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, వేలాది మంది ప్రజలు ఈ జైత్రయాత్రలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 'ఇండ్ల స్థలాలను కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి'

నాంపల్లి, సెప్టెంబర్ 12 : దౌర్జన్యంగా తమ ఇండ్ల స్థలాలను కబ్జా చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని సుంకిశాల గ్రామానికి చెందిన గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. శనివారం నాంపల్లి మండల పరిధిలోని సుంకిశాల గ్రామానికి చెందిన గ్రామస్తులు కబ్జాకు గురి అవుతున్న స్థలం వద్ద టెంట్ వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. 30 ఏండ్ల క్రితం ఇదే గ్రామానికి చెందిన తుమ్మలపల్లి సుజాతమ్మ దేవి దగ్గర భూమిని కొనుగోలు చేసి అక్కడే ఇండ్లు నిర్మించుకుని నివాసం ఉన్నాం. అక్కడ



ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించక లేకపోవడంతో అక్కడి నుండి రోడ్డు మీదకు వచ్చి ఇండ్లను నిర్మించుకుని ఇక్కడే ఉంటున్నాం. ప్రస్తుతం అక్కడ ఉన్న ఇండ్లను తుమ్మలపల్లి రాజవర్ధన్ రెడ్డి అనే వ్యక్తి దౌర్జన్యంగా జెసీబీ సహాయంతో ఆ ఇండ్లను పూర్తిగా నేలమట్టం చేసి తమ ఇండ్ల స్థలాలను, గ్రామ కంఠం భూమిని కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నాడన్నారు.ఎదురు తిరిగితే బెదిరింపులకు పాల్పడుతూ తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇండ్ల నిర్మాణాలు ఉండగానే ఆ భూమిని రెవెన్యూ అధికారులు అతడికి పట్టా చేశారని అంటున్నాడని, తమ ఇండ్లు ఉండగా రెవెన్యూ అధికారులు ఏ విధంగా పట్టా చేస్తారని ప్రశ్నిస్తారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామ కంఠం భూమిని కబ్జా చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకుని తమ ఇండ్ల స్థలాలను కాపాడాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో బాధితులు బాసిపాక రాములు, బుడియాపాక లక్ష్మయ్య, ఆడపల్లి జయమ్మ, పిల్లి లక్ష్మమ్మ, ఎరుకల ఆంజనేయులు, కలకొండ లక్ష్మయ్య, బుడియాపాక వెంకటయ్య, అబ్బనబోయిన లక్ష్మమ్మ, పల్లపు శోభన్ బాబు, హరికృష్ణ, మద్దిమడుగు మల్లయ్య, అబ్బనబోయిన మల్లమ్మ, ఎడమ మల్లేష్, యాదయ్య, సైదులు, రమేష్, వంశీ పాల్గొన్నారు.

# చిప్పాడలో తప్పిన ముప్పు

## రోడ్డుపై బోల్తా పడిన భారీ ఇసుక లారీ

చిప్పాడ:చిప్పాడ సమీప ప్రధాన రహదారిపై శనివారం ఒక భారీ ఇసుక లారీ ఒక్క సారిగా అదుపుతప్పి బోల్తా పడింది లారీ లోడుతో వేగంగా వెళ్తుండగా ఒక్క సారిగా వాహనం అదుపు తప్పడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. లారీ బోల్తా పడిన సమయంలో రహదారిపై ఇసుక పూర్తిగా కుప్పలుగా పేరుకు పోయింది ప్రమాదం జరిగిన సమయంలో లారీ క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయా లయ్యాయి. అదృష్టవ శాత్తూ ఆ సమయంలో రహదారిపై ఇతర వాహనాలు ఏవీ పక్కన లేకపోవడంతో పెద్ద ప్రాణా పాయం తప్పింది ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి, క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్,క్లీనర్ లను బయటకు తీసి చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి ప్రస్తుతం సురక్షితంగానే ఉన్నట్లు తెలుస్తోంది భారీ లారీ రోడ్డుకు అడ్డంగా బోల్తా పడటంతో పాటు,టన్నుల కొద్దీ ఇసుక రోడ్డుపై పడి పోవడంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహన దారులకు తీవ్ర అంత రాయం ఏర్పడింది సుమారు కిలోమీటర్ మేర వాహనాలు నిలిచి పోయాయి సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు భారీ క్రేన్ల సహాయంతో బోల్తా పడిన లారీని పక్కకు తొల గించేందుకు రహదారిపై ఉన్న ఇసుకను శుభ్రం చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీ కరించేందుకు చర్యలు ముమ్మరం చేశారు అతివేగం, బ్రేక్ ఫెయిల్యూర్లే కారణమా?ప్రాథమిక సమాచారం ప్రకారం ఇసుక లారీలు మితిమీరిన వేగం తో ప్రయాణించడం లేదా అకస్మాత్తుగా బ్రేకులు ఫెయిల్ అవ్వడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రోడ్డు సమస్య కోసం రోడ్డెక్కిన ప్రజలు

పరిగి-లక్నాపూర్ రోడ్డు సమస్య పరిష్కరించాలంటూ గ్రామస్తుల పాదయాత్ర గ్రామ సర్పంచ్ అరెస్ట్

పరిగిపరిగి?లక్నాపూర్ రహదారి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పలువురు గ్రామాల.. ప్రజలు పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రకు ఇతర గ్రామస్తులు మద్దతు పలికారు. రహదారి అధ్వానంగా మారడంతో వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలుమార్లు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.పరిగి మండలం మిట్టకొడూర్, లక్నాపూర్, గోవిందాపూర్, చిగురాలపల్లి, కిష్టమ్మ గుడి తాండా, తదితర గ్రామాల ప్రజలు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. రహదారిపై గుంతలు ఏర్పడి వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని తెలిపారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు స్పందించి పరిగి?లక్నాపూర్ రోడ్డును వెంటనే అభివృద్ధి చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. పరిగి పోలీసులు పాదయాత్ర చేస్తున్న వారిని అడ్డుకొని పాదయాత్ర చేస్తే సమస్య పరిష్కారం కాదని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్తే పరిష్కారమవుతుందని పోలీసులు తెలిపిన వినకుండా గంటపాటు చిగురాళ్లపల్లి గేటు సమీపంలో ధర్నా చేపట్టారు.ఈ ధర్నాలో కొంతమంది ప్రతిపక్ష నాయకులతో పాటు పోలీసులకు మధ్య కొంత సేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. పోలీసులు వారందరిని సముదాయించి అక్కడి నుంచి పంపించగా వారందరూ బైకు ర్యాలీగా పరిగి కి వెళ్ళిపోయారు. గ్రామ సర్పంచ్ ను తెల్లవారుజామునే ర్యాలీకి ముందే అరెస్ట్ చేసి పరిగి పోలీస్ స్టేషన్కు తరలించారు పోలీసులు.

# మొఘల్ పుర జిహెచ్ఎంసి కార్యాలయంలో మట్టి ప్రతిమల పంపిణీ




హైదరాబాద్, సెప్టెంబర్ 12 (ఇయ్యాల తెలంగాణ) : మట్టి ప్రతిమలతోనే సంపూర్ణ పూజా విధానాన్ని శాస్త్ర యుక్తంగా కొనసాగించవచ్చని జిహెచ్ఎంసి చార్మినార్ సర్కిల్ ఎస్ ఎస్ దుర్గాప్రసాద్ సూచించారు. మొఘల్ పుర జిహెచ్ఎంసి కార్యాలయంలో మట్టి వినాయకుల పంపిణీ చేశారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ వినాయకులతో ప్రకృతికి అనేక రకాలుగా పర్యావరణమ్ పాడవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ ధర్మిందర్ ఆశాలు పూర్ణిమ కుమారి, పద్మ, స్వప్న, భాగ్య , రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

# శాంతియుత గణేష్ ఉత్సవం చార్మినార్ జోన్ పోలీసులు కేంద్ర శాంతి కమిటీతో సమన్వయ సమావేశం




ఇయ్యాల తెలంగాణ:చార్మినార్ జోన్ డీసీపీ కిరణ్ ఖరే, రాబోయే గణేష్ ఉత్సవం మరియు నిమజ్జన ఊరేగింపుల కోసం ఏర్పాట్లు మరియు భద్రతా చర్యలకు సంబంధించి కేంద్ర శాంతి కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అన్ని డివిజన్ల ఏసీపీలు, ఎస్హెచ్ఓలు మరియు కేంద్ర శాంతి కమిటీ సభ్యులు హాజరయ్యారు. డీసీపీ ఏర్పాట్లపై వివరంగా చర్చించి, ఉత్సవాన్ని శాంతియుతంగా, సురక్షితంగా మరియు సజావుగా నిర్వహించడానికి సంబంధిత వర్గాలందరి సహకారాన్ని కోరారు. గణేష్ నిమజ్జనం శుక్రవారం జరగనున్నందున, శాంతి కమిటీ సభ్యులు, నిర్వాహకులు మరియు ప్రజలు మత సామరస్యం, పరస్పర గౌరవం మరియు శాంతిని పాటించాలని, సోదరభావంతో ఉత్సవాన్ని జరుపుకోవాలని డీసీపీ విజ్ఞప్తి చేశారు. శాంతి కమిటీ సభ్యులు పోలీసులతో చురుకుగా సమన్వయం చేసుకోవాలని, స్థానిక సంఘాలు మరియు నిర్వాహకులతో సంప్రదింపులు జరపాలని, మరియు ప్రజాశాంతికి భంగం కలిగించే ఎలాంటి అపార్థాలు, వదంతులు, వివాదాలు లేదా కార్యకలాపాలను నివారించడంలో సహాయపడాలని డీసీపీ ప్రత్యేకంగా కోరారు. ప్రజలను, ఉత్సవ నిర్వాహకులను పోలీసుల సూచనలను పాటించేలా ప్రోత్సహించాలని, ట్రాఫిక్ మరియు భద్రతా ఏర్పాట్లకు సహకరించాలని, ఊరేగింపు సమయంలో క్రమశిక్షణ పాటించాలని, సాధారణ ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా ఉత్సవం శాంతియుతంగా జరిగేలా చూడాలని సభ్యులకు సూచించారు. సామరస్యాన్ని కాపాడటంలో కేంద్ర శాంతి కమిటీ పోషించిన కీలక పాత్రను డీసీపీ అభినందించారు. ఉత్సవానికి ముందు, ఉత్సవ సమయంలో పోలీసు విభాగానికి పూర్తి సహకారం అందించాలని ఆయన సభ్యులందరినీ కోరారు.శాంతి, సామరస్యం, పరస్పర గౌరవంతో గణేష్ ఉత్సవాన్ని మనమందరం కలిసి జరుపుకుందాం. హింస, అవాంతరాలు లేకుండా సురక్షితమైన, శాంతియుతమైన గణేష్ ఉత్సవాన్ని నిర్వహించడం మనందరి సమిష్టి బాధ్యత

# ట్రాక్టర్ ఢీకొని కాలు కోల్పోయిన యువకుడు

ట్రాక్టర్ డీ కొట్టి ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడగా వారిలో ఓ యువకుడు కాలు ను కోల్పోయాడు. శనివారం ఉదయం బి.కొత్తకోట మండలంలో జరిగిన ఘటనపై బాధితుల కుటుంబీకుల కథనం.. నాయిని బాబి పంచాయితీ, కమ్మొల్లపల్లి కు చెందిన రాజేంద్ర (23), కాయలోల్లపల్లి కు చెందిన హరికృష్ణ (28) లు బైకులో కురబలకోట

మండలంలోని అంగళ్లు గొర్రెల సంతకు బయలుదేరారు. స్కూటర్ మార్గమధ్యంలోని నాయిని బావి కోళ్ల ఫారం వద్దకు రాగానే ట్రాక్టర్ డీ కొట్టి హరికృష్ణ కాలు రెండుగా విరిగిపోయింది. అలాగే రాజేంద్ర స్వల్పంగా గాయపడడంతో క్షతగాత్రులను 108లో హుటాహుటిన మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి మెరుగైన వైద్య చికిత్సల అనంతరం హరికృష్ణను వెంటనే బెంగళూరుకి రెఫర్ చేశారు. కొత్తకోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు...

## రోడ్లపైకి స్విగ్గీ, జొమాటో బండ్లు.. హైదరాబాద్‌లో గాలి కాలుష్యం : కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్



తెలంగాణలో బైక్ ట్యాక్సీలుగా నడిచే వాహనాలకు ఇకపై పసుపు రంగు నంబర్ ప్లేట్లు తప్పనిసరి కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. పసుపు రంగు నంబర్ ప్లేట్ ఉంటేనే బైక్లను ట్యాక్సీలుగా నడిపేందుకు అనుమతి లభించనుంది. ఈ నిర్ణయం తీసుకుంటే బైక్ ట్యాక్సీలతో జీవనం సాగిస్తున్న వేలాది మందికి ఆర్థికంగా పెను భారం కానుంది.ఇదిలా ఉంటే కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ అసెంబ్లీలో చేసిన కామెంట్స్ నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. హైదరాబాద్‌లో గాలి కాలుష్యం ఎంతుందో మనకు తెలుసు. రోజు రోజుకీ ఎక్కువమంది బైకులు కొనుక్కోవడం కావొచ్చు.. కార్లు కొనుక్కోవడం కావొచ్చు. ఈ మధ్య కాలంలో ఎక్కువమంది స్విగ్గీ, జొమాటో, క్యాబ్‌లపై ఆధారపడి చాలా మంది బండ్లు కొంటున్నారు.. దీంతో ఎక్కువ బండ్లు రోడ్డుపైకి వచ్చి ఎంత కాలుష్యం పెరుగుతందో మనందరికీ తెలుసు. ప్రజలు శ్వాస తీసుకునేందుకు కూడా ఇబ్బంది పెడే పరిస్థితి ఉందన్నారు.

## ఢిల్లీలో అడుగుపెట్టిన చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్..



న్యూఢిల్లీ: చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ న్యూఢిల్లీలో అడుగుపెట్టారు. 18వ బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చిన ఆయన.. ప్రధాని నరేంద్ర మోదీతో కీలక ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొననున్నారు. 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత షీ జిన్‌పింగ్ భారత్‌కు రావడం ఇదే తొలిసారి. మోదీ–జిన్‌పింగ్ భేటీలో వాస్తవాధీన రేఖ (ఒంఅ) వద్ద పరిస్థితులు, సరిహద్దు సాధారణీకరణ, వాణిజ్యం, ఆర్థిక సంబంధాలు, పెట్టుబడులు తదితర అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఇటీవల ఇరు దేశాల మధ్య సంబంధాల్లో చోటుచేసుకున్న పురోగతిని కూడా నేతలు సమీక్షించనున్నారుగల్వాన్ ఘర్షణ తర్వాత దెబ్బతిన్న భారత్–చైనా సంబంధాలను క్రమంగా సాధారణ స్థితికి తీసుకురావడానికి 2024 నుంచి ఇరు దేశాలు పలు చర్యలు చేపట్టాయి. సరిహద్దుల్లో సైనిక బలగాల ఉపసంహరణతో పాటు వీసాలు, వాణిజ్యం, ప్రత్యక్ష విమాన సర్వీసుల విషయంలోనూ పురోగతి నమోదైంది.ఇదిలా ఉండగా, జిన్‌పింగ్ పర్యటన నేపథ్యంలో దేశ రాజధానిలో భద్రతను కట్టుదిట్టం చేశారు. బ్రిక్స్ సదస్సు వేదిక భారత్ మండపం పరిసరాల్లో భారీగా భద్రతా బలగాలను మోహరించారు. జిన్‌పింగ్ పర్యటన భారత్–చైనా ద్వైపాక్షిక సంబంధాల్లో తదుపరి దశకు నాంది పలుకుతుందా అన్నది మోదీతో జరిగే భేటీపై ఆసక్తిని పెంచుతోంది.

## భారత్ వ్యూహాత్మక, నైతిక నాయకత్వం వహించాలి.. కేంద్రానికి కాంగ్రెస్ పిలుపు..

బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సును వేదికగా చేసుకుని భారత్ వ్యూహాత్మకంగా, నైతికంగా నాయకత్వం వహించే దిశగా సాగాలని కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. అంతర్జాతీయంగా వేగంగా మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో భారత్ తన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని మరింత బలంగా చాటుకోవాలని సూచించింది. గ్లోబల్ సౌత్ దేశాల ప్రయోజనాల పరిరక్షణ కోసం భారత్ చిత్తశుద్ధితో పనిచేయాలని కాంగ్రెస్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్ వ్యాఖ్యనించారు భారతీయ వస్తువులు, సేవల ఎగుమతులకు బ్రిక్స్ మార్కెట్లలో సమాన ప్రాధాన్యత దక్కేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అనుసరించిన సమతుల్య విదేశాంగ విధానాన్ని ప్రస్తుత ప్రభుత్వం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (జఔొఅ)లో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కోసం బ్రిక్స్ సదస్సులో మద్దతు సాధించాలన్నారు కేవలం ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలకే పరిమితం కాకుండా.. అంతర్జాతీయ న్యాయం, శాంతి, సార్వభౌమత్వం, మానవతా విలువలకు ప్రాధాన్యం ఇచ్చే నైతిక నాయకత్వాన్ని భారత్ ప్రదర్శించాలని కాంగ్రెస్ కోరింది . భారత్ తన సాంప్రదాయ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని కాపాడుకోవాలని కాంగ్రెస్ పేర్కొంది. ఏ ఒక్క శక్తి కూటమికీ పూర్తిగా దగ్గర కాకుండా.. దేశ ప్రయోజనాలకు అనుగుణంగా అన్ని దేశాలతో సంబంధాలను కొనసాగించడం ముఖ్యమని తెలిపింది.



## మోదీతో ఫొటో కోసం ప్రతినిధుల సందడి.. పుతిన్, పెజెష్కియన్ ఏం చేశారంటే..



భారత్ వేదికగా జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో ఓ సరదా సన్నివేశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి ఫొటో దిగేందుకు పలువురు ప్రతినిధులు ఆయన చుట్టూ చేరారు. అదే సమయంలో అక్కడ ఉన్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ వారికి చోటిచ్చేందుకు పక్కకు తప్పుకున్నారు. ఈ దృశ్యాలకు సంబంధించిన వీడియో నెటిజన్లను ఆకట్టుకుంటోందిన్యూఢిల్లీలో శుక్రవారం బ్రిక్స్ బిజినెస్ ఫోరంలో ఈ ఘటన జరిగింది. కార్యక్రమం సందర్భంగా మోదీ వద్దకు వచ్చిన కొందరు ప్రతినిధులు ఆయనతో ఫొటో దిగేందుకు ఆసక్తి చూపించారు. ఓ ప్రతినిధి 'మీతో ఒక ఫొటో దిగొచ్చా' అని అడగ్గా.. మోదీ వెంటనే అంగీకరించారు. దీంతో మరికొందరు ప్రతినిధులు కూడా ఆయన చుట్టూ చేరారు. అందరూ కెమెరాకు పోజిచ్చేందుకు సిద్ధమయ్యారు. అదే సమయంలో అక్కడ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ కూడా ఉన్నారుప్రతినిధులు మోదీ చుట్టూ చేరుతుండటంతో వారికి అవకాశం కల్పిస్తూ పుతిన్, మసూద్ పెజెష్కియన్ పక్కకు వెళ్లారు ఫొటోకు పోజిస్తున్న సమయంలో మోదీ చేసిన సరదా వ్యాఖ్య అక్కడ నవ్వులు పూయించింది. మహిళా ప్రతినిధులను ఉద్దేశించి 'యూ ఆర్ లక్కీ, సో మెనీ లేడీస్' అని మోదీ అన్నారు. దీనికి వారు కూడా వెంటనే స్పందిస్తూ 'వుయ్ ఆర్ ఆల్ సో లక్కీ' అన్నారు. దీంతో మోదీతో పాటు అక్కడున్న వారంతా నవ్వుకున్నారు. ఫొటో సెషన్ ముగిసిన తర్వాత మోదీ వారికి ధన్యవాదాలు తెలిపారు.

## 'అతిథి దేవో భవ'.. బ్రిక్స్ అతిథులకు రాజసం ఉట్టిపడేలా భారతీయ ఆతిథ్యం




దేశ రాజధాని ఢిల్లీలో 18వ బ్రిక్స్ సదస్సు జరుగుతోంది. ఈ సందర్భంగా హాజరవుతున్న అతిథుల కోసం జైపూర్‌కు చెందిన ప్రముఖ సంస్థ అరుణ్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రత్యేక వెండి టేబుల్‌వేర్, కట్లరీని రూపొందించింది. ప్రాచీన భారతదేశంలో రాజులు, మహారాజుల విందుల్లో ఉపయోగించిన పాత్రలను గుర్తుచేసేలా రాజసం ఉట్టిపడే సంప్రదాయ డిజైన్లతో వీటిని తయారు చేశారు.భారతీయ, చైనీస్, రష్యన్ తదితర దేశాల వంటకాలను వడ్డించేందుకు అనువుగా దాదాపు 50 నుంచి 60 రకాల గిన్నెలు, ప్లేట్లు, స్పూన్లు, మూతలతో కూడిన కంటైనర్లను ప్రత్యేకంగా డిజైన్ చేశారు. ప్రతి పాత్రను ఎంతో నైపుణ్యంతో రూపొందించి, అందమైన కళాకృతులతో అలంకరించారు. ప్రతి వస్తువుకు మెరుగైన మెరుపు, నాణ్యత వచ్చేలా 10 దశల్లో కోటింగ్, ఫినిషింగ్ ప్రక్రియను నిర్వహించారు. భారతదేశానికి వచ్చే విశిష్ట అతిథులను దైవ సమానులుగా భావించే 'అతిథి దేవో భవ' సంప్రదాయాన్ని ఈ ప్రత్యేక వెండి పాత్రలు ప్రపంచ దేశాల నేతలకు చాటిచెబుతున్నాయి. భారతీయ ఆతిథ్య సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా వీటిని ప్రత్యేక డిజైన్లతో తయారు చేశారు.అరుణ్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సీఈవో అరుణ్ పబువాల్ మాట్లాడుతూ.. ప్రముఖుల కార్యక్రమాలకు తమ టేబుల్‌వేర్‌ను అందించడం ఇదే తొలిసారి కాదన్నారు. 2023లో జరిగిన జీ20 సదస్సుతో పాటు పలు వీఐపీ కార్యక్రమాలు, దేశానికి వచ్చిన అధ్యక్షుల పర్యటనల్లోనూ తమ ఉత్పత్తులను ఉపయోగించినట్లు తెలిపారు. తమ కట్లరీలో ఆధునిక, సంప్రదాయ డిజైన్లు ఉన్నాయని చెప్పారు.కంపెనీ ఎండీ అంతర పబువాల్ మాట్లాడుతూ.. ఉత్పత్తుల నాణ్యతే తమ ప్రధాన ప్రత్యేకత అని తెలిపారు. పాత్రల తయారీలో నాణ్యత విషయంలో రాజీ పడబోమని చెప్పారు. పూత, డిజైన్, ఫినిషింగ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని, ఉత్పత్తుల తయారీ నుంచి డిస్పాచ్ వరకు మొత్తం 10 దశల్లో ఫినిషింగ్ ప్రక్రియ ఉంటుందని వివరించారు.

## మావోయిస్టు సభ్యురాలి కోసం 'ఇంటెలిజెన్స్' ఆరా

అక్కన్నపేట(మెదక్): సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రానికి చెందిన మావోయిస్టు దండకారణ్య సభ్యురాలు కాశబోయిన స్వరూప గురించి హైదరాబాద్ నుంచి వచ్చిన ఇంటలిజెన్స్ అధికారులు ఆరా తీశారు. స్వరూప బంధువులు, గ్రామస్థులను కలిసి ఆమె ఎప్పుడు పార్టీలోకి వెళ్లింది..? వెళ్లినప్పుడు నుంచి ఎప్పుడైనా ఎవరితోనైనా మాట్లాడిందా..? గ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులను కలిసిందా..? ఆమె గురించి ఇంకేమైనా సమాచారం మీకు తెలుసా..?బ్రతికి ఉందో.. మృతి చెందిందో అనే వివరాలను సేకరించారు. ఆమెకు చెందిన కూలిపోయిన ఇంటిని పరిశీలించారు. స్వరూప చిన్నతనంలోనే తల్లిదండ్రులు మరణించడంతో నానమ్మ,తాత దగ్గర పెరిగింది. నానమ్మ, తాత చనిపోగా ఆమె చెల్లి మాత్రమే ఉందని వివరాలను తెలుసుకున్నారు.అలాగే స్వరూప చదువుకున్న పాఠశాలలో ఆమెకు సంబంధించిన ఫోటోలు దొరుకుతాయేమోనని రికార్డులను వెతికారు. ఆమెకు సంబంధించిన వివరాలు దొరకకపోవడంతో తిరిగి వెళ్లిపోయారు. స్వరూప కేసు క్లోజ్ చేసేందుకే వారు వచ్చారని, దండకారణ్య సభ్యురాలుగా కాశబోయిన స్వరూప పనిచేస్తున్నప్పుడు ఆమెపై రెండు లక్షల రివార్డు ఉందని గతంలో పోలీసులు ప్రకటించారు. దీనికి సంబంధించి ఆమె కుటుంబ సభ్యులు ఎవరైనా ఉన్నారనే వివరాలు తెలుసుకునేందుకే ఇంటెలిజెన్స్ సీఐ మల్లికార్జున్ గౌడ్ బృందం వచ్చినట్లు సమాచారం.



## బ్రిక్స్‌లో కీలక పరిణామం.. సంయుక్త ప్రకటనపై ఏకాభిప్రాయం..



భారత్ ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు ముందు కీలక పరిణామం చోటుచేసుకుంది. బ్రిక్స్ సభ్య దేశాలు సంయుక్త ప్రకటనపై ఏకాభిప్రాయానికి వచ్చినట్లు రాయిటర్స్ వార్తా సంస్థ వెల్లడించింది. ఈ ప్రకటనను శనివారం నేతలు అధికారికంగా ఆమోదించే అవకాశం ఉందిప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు, ముఖ్యంగా పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో బ్రిక్స్ దేశాల మధ్య భిన్నాభిప్రాయాలు నెలకొన్నాయి. ఈ విభేదాలను అధిగమించి సంయుక్త ప్రకటనకు అంగీకారం కుదరడం భారత్‌కు కూడా కీలక దౌత్య విజయంగా భావిస్తున్నారు. సంయుక్త ప్రకటనలో ఏ ఒక్క దేశం పేరును ప్రత్యేకంగా ప్రస్తావించే అవకాశం లేదు. అయితే ఏ దేశమైనా ఏకపక్షంగా యుద్ధానికి దిగడాన్ని ఖండించే అంశాన్ని ప్రకటనలో చేర్చినట్లు సమాచారం ఇరాన్, యూఏఈ రెండు బ్రిక్స్ సభ్య దేశాలే అయినప్పటికీ.. ప్రస్తుత గల్ఫ్ సంక్షోభంలో ఇరు దేశాల వైఖరులు పరస్పర విరుద్ధంగా ఉన్నాయిఈ పరిస్థితుల్లో ఇరు దేశాలూ అంగీకరించే భాషను సంయుక్త ప్రకటనలో పొందుపరచడం బ్రిక్స్ దౌత్యవేత్తలకు పెద్ద సవాలుగా మారింది. బ్రిక్స్ అధ్యక్ష దేశంగా భారత్‌కు ఈ సదస్సు అత్యంత కీలకం. ఇరాన్‌తోనూ, యూఏఈతోనూ భారత్‌కు మంచి సంబంధాలు ఉన్నాయి. దీంతో ఇరు దేశాల మధ్య ఉన్న విభేదాలను పక్కనపెట్టి బ్రిక్స్‌లో ఏకాభిప్రాయం సాధించేలా భారత్ చర్చలను ముందుకు నడిపించింది.

## నటి అమీషా పటేల్ ఇంట్లో చోరీ కేసు.. పనిమనిషి అరెస్టు..



యాక్టర్ అమీషా పటేల్ ఇంట్లో దొంగతనం కేసులో మహిళా పనిమనిషిని పోలీసులు అరెస్టు చేశారు. ముంబైలో చర్చ్ గేట్ లోని అమీషా ఇంట్లో ఈ ఏడాది జనవరిలో రూ.5 లక్షల విలువైన బంగారు నగలు చోరీకి గురయ్యాయి. వాటిలో వజ్రం పొదిగిన బంగారు గాజు కూడా ఉంది. చోరీ తర్వాత అమీషా తల్లి ఆషా పటేల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేసిన తర్వాత నిందితురాలిని అరెస్టు చేశారు. ప్రస్తుతం ఆమె జైల్లో ఉందని అమీషా మేనేజర్ తెలిపారు. నిందితురాలిని 40 ఏండ్ల సీమా ఘటేగా గుర్తించారుఅమీషా ఇంట్లో ఆమె ఎనిమిది నెలల పాటు పనిమనిషిగా చేసింది. దొంగతనం జరిగిన తర్వాత సీమా పని మానేసింది. దీంతో ఆమెను ఆషా అనుమానించారు. చోరీ చేసిన నగలను మర్యాదగా తిరిగి ఇవ్వాలని లేకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. నగలను తిరిగి ఇవ్వకపోవడంతో పోలీసులకు ఆషా కంప్లైంట్ చేశారు. భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు. విరార్ ప్రాంతంలో సీమాను అదుపులోకి తీసుకున్నారు. ఆమెను ముంబై కోర్టులో హాజరుపరుచగా కోర్టు ఈనెల 15 వరకు రిమాండ్ విధించింది. జ్యువెలరీని రికవరీ చేసే పనిలో ఉన్నామని పోలీసులు తెలిపారు. కాగా.. అమీషా పటేల్ చివరిసారిగా గదార్ మూవీలో సన్నీ డియోల్ తో కలిసి నటించింది. 2023లో ఈ చిత్రం విడుదలైంది.

## లైంగిక వేధింపుల కేసు.. డీ-10 డ్యాన్స్ షో విజేత రాజు అరెస్టు..

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన డీ–10 డ్యాన్స్ షో విజేత రాజును హైదరాబాద్ మియాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. లైంగికంగా వేధించాడని, సినిమా అవకాశాల పేరుతో మోసం చేశాడని ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ నెల 9న కేసు నమోదు అయ్యింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నిందితుడు రాజును అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.అయితే రాజుపై కేసు నమోదు చేసిన విషయాన్ని మియాపూర్ పోలీసులు ఇన్ని రోజులు గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ విషయం వెలుగులోకి రావడంతో డ్యాన్స్ షో వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, యువతి చేసిన ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.



## వర్షం కురిసే..రైతన్న మురిసే.. సోయాబీన్, పత్తి పంటలకు ఊరట



కుభీర్: గత నెల రోజులుగా వర్షం కోసం ఎదురుచూస్తున్న కుభీర్ మండల రైతన్నలకు శనివారం కురిసిన వర్షం ఎంతో ఊరటనిచ్చింది. శనివారం మధ్యాహ్నం నుంచి మండలంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తుండడంతో రైతుల మోముల్లో ఆనందం వెల్లివిరిసింది. వరుణుడు కరుణించడంతో ఎండిపోతున్న పంటలకు ప్రాణం వచ్చినట్లైందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.గత నెల రోజులుగా మండలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ముఖ్యంగా సోయాబీన్ , పతి అందకపోతే దిగుబడులు తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా పత్తి పంటకు కూడా ప్రస్తుత వర్షం ఎంతో అవసరమని రైతులు చెబుతున్నారు.వర్షాలు లేక నేలలో తేమ తగ్గిపోవడంతో పంటలు వాడిపోతున్న పరిస్థితి నెలకొంది. కొందరు రైతులు బోరు బావుల ద్వారా పంటలను కాపాడుకునేందుకు ప్రయత్నించినప్పటికీ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, నీటి కొరత వంటి సమస్యలు ఎదుర్కొన్నారు.ఈ తరుణంలో శనివారం మధ్యాహ్నం నుంచి వర్షం ప్రారంభం కావడంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి.వర్షపు నీటితో పొలాల్లో తేమ పెరిగి పంటలకు ప్రయోజనం చేకూరుతుందని రైతులు భావిస్తున్నారు. మరికొన్ని రోజులు ఇదే విధంగా వర్షాలు కొనసాగితే సోయాబీన్, పత్తి పంటలకు మరింత మేలు జరుగుతుందని అన్నారు. వర్షం కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్న రైతన్నలకు శనివారం కురిసిన వాన కాస్త ఉపశమనం కలిగించింది.

## పీఏ ఇంట్లో నగదు, నగలు స్వాధీనం చేసుకున్న ఈడీ..

### కీలక పదవ్యులకు ఉత్తరాఖండ్ మాజీ సీఎం రాజీనామా..!


ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హరీశ్ రావత్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన రెండు పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన పీఏ చందన్ సింగ్ జీనా ఇంట్లో ఈడీ సోదాలు నిర్వహించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.ఉత్తరాఖండ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యవర్గం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (అచిఅ) శాశ్వత ఆహ్వానితుడి పదవుల నుంచి రావత్ వైదొలిగారు. ఎన్నికల వేళ.. తన వల్ల పార్టీకి ఇబ్బంది కలగకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు రావత్ తెలిపారు.



ఈడీ గురువారం డెహ్రాడూన్‌లోని పలు ప్రాంతాల్లో సోదాలు చేసింది. 2016లో ఉత్తరాఖండ్ సబార్డినేట్ సర్వీస్ సెలక్షన్ కమిషన్ నియామక పరీక్షలో ఓఎంఆర్ షీట్లను మార్చి అక్రమాలకు పాల్పడ్డారని జీనాపై నమోదైన కేసుకు సంబంధించి ఈ చర్యలు చేపట్టింది.జీనా నివాసంలో రూ.32 లక్షల నగదు, సుమారు 200 గ్రాముల బంగారు నాణేలు, ఆభరణాలు, 12 ఖరీదైన గడియారాలు స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ తెలిపింది. జీనా, ఆయన కుటుంబసభ్యుల బ్యాంకు ఖాతాల్లోని రూ.52.16 లక్షలను స్తంభింపజేసింది. అయితే జీనాపై వచ్చిన ఆరోపణలను తాను నమ్మడం లేదని, అతను బాగా కష్టపడి పనిచేసే వ్యక్తి అని రావత్ చెప్పారు. ఆధారాలు ఉంటే చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. గతంలో రావత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జీనా ఓఎస్డీగా పనిచేశారు. ఆ తర్వాత పీఏగా కొనసాగుతున్నారు.

## సంధ్యాల హైమావతికి ఓయూ డాక్టరేట్

కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 12 : సింగరేణి కార్మిక ప్రాంతమైన కొత్తగూడెం పట్టణానికి చెందిన సంధ్యాల హైమావతి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా పొందారు. సింగరేణిలో కార్మికుడిగా పని చేసిన స్థానిక మధుర బస్తీకి చెందిన సంధ్యాల కొమరయ్య, శంకరమ్మల కుమార్తె హైమావతి. ఇటీవల ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన 85వ స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయం ఛాన్స్లర్ శివప్రసాద్ శుక్ల చేతుల మీదుగా ఆమె డాక్టరేట్ అందుకున్నారు. డాక్టర్ ఆలియా మేడం పర్యవేక్షణలో రసాయన శాస్త్ర విభాగంలో " డాకింగ్ స్టడీస్ అండ్ టెట్రాజోల్ డేరివాటివ్స్" అంశంపై చేసిన పరిశోధన పత్రానికి హైమావతికి పట్టా లభించింది. పేదరికం నేపథ్యం నుండి వచ్చినప్పటికీ పట్టుదలతో చదివి ఉన్నత విద్యలో రాణించి డాక్టరేట్ పట్టా పొందడం పట్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



## 'నోటీసులు అందుకున్న ఓటర్లు పంచాయతీ కార్యాలయంలో సమాచారం అందించాలి'

### బూర్గంపహాడ్ తాసీల్దార్ కేఆర్కే ప్రసాద్

బూర్గంపహాడ్, సెప్టెంబర్ 12 : నోటీసులు అందుకున్న ఓటర్లు మేజర్ పంచాయతీ సారపాకలో సమాచారం అందించాలని తాసీల్దార్ కేఆర్కే ప్రసాద్ తెలిపారు. శనివారం మేజర్ పంచాయతీ కార్యాలయంలో బీఎల్వో, సంబంధిత అధికారులతో సర్పంచ్ గుగులోత్ కిశోర్‌నాయక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితాలో పేర్లు ఉండి అక్షరాలు తప్పుగా వచ్చిన వారికి నోటీసులు అందజేశామని, నోటీసులు అందుకున్న ఓటర్లు తమ వద్ద ఉన్న ఆధారాలతో పంచాయతీ కార్యాలయంలో సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు.



ఓటు హక్కు కోల్పోకుండా ఉండేందుకు అధికారులు సూచించిన డాక్యుమెంట్లను అప్పగించాలని తెలిపారు.నోటీసులు అందుకోని ఓటర్లు నోటీసులు అందుకుని వాటికి సంబంధించిన ఆధారాలు అధికారులకు అందించి ఓటు హక్కు కోల్పోకుండా చూసుకోవాలన్నారు. సర్ ప్రక్రియ విధుల్లో పాల్గొనే అధికారులు 24 గంటలూ అందుబాటులో ఉండి ఓటర్లకు సహకరించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరు నమోదు చేసుకోవాలని, అందుకోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి గుగులోత్ రవికుమార్, వీఆర్వోలు ప్రసాద్, సీతమ్మ, బీఎల్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## వసతి గృహం విద్యార్థినులపై ఎలుకల దాడి

### సారపాక మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల కళాశాల వసతి గృహంలో ఘటన

### రెండుసార్లు ఘటన జరిగినా స్పందించని ఉన్నతాధికారులు

### గుట్టుచప్పుడు కాకుండా నలుగురు విద్యార్థినులకు చికిత్సవార్తాపత్రిక చందా

బూర్గంపహాడ్, సెప్టెంబర్ 12 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం సారపాకలో గల తెలంగాణ రాష్ట్ర మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల కళాశాల వసతి గృహంలో విద్యార్థినులపై ఎలుకలు దాడిచేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. సారపాక తెలంగాణ రాష్ట్ర మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల కళాశాల, వసతి గృహం ఒకే భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ కళాశాలలో ఫస్టియర్, సెకండియర్ కలిపి మొత్తం 160 నుంచి 200 వరకు విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ నెల 9వ తేదీన రాత్రి సమయంలో వసతి గృహంలో విద్యార్థినుల కాళ్లపై ఎలుకలు దాడి చేశాయి. నలుగురు విద్యార్థినులు దాడికి గురవ్వగా సమాచారం బయటకు తెలియనీయకుండా వసతిగృహం సిబ్బంది, కళాశాల యాజమాన్యం కలిసి దాడికి గురైన విద్యార్థినులను వైద్య చికిత్స కోసం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ టీటీ ఇంజక్షన్ చేయించి తిరిగి గుట్టుచప్పుడు కాకుండా కళాశాలకు తీసుకువెళ్లారు.మైనార్టీ కళాశాల వసతిగృహంలో విద్యార్థినులపై ఎలుకలు దాడి చేయడం ఇది రెండవసారి. ఇదే నెలలో 3వ తేదీన ముగ్గురిని ఎలుకలు గాయపర్చగా తాజాగా 9వ తేదీన నలుగురు విద్యార్థులపై ఎలుకలు దాడి చేయడం కళాశాల, వసతిగృహ యాజమాన్య నిర్లక్ష్య వైఖరిని స్పష్టం చేస్తుంది. వసతి గృహంలో పదే పదే విద్యార్థినులపై ఎలుకలు దాడిచేస్తున్నా ఉన్నతాధికారులు కళాశాల యాజమాన్యం, వసతి గృహం ఇన్‌చార్జి పనితీరును పట్టించుకోకపోవడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.విద్యార్థినులపై ఎలుకల దాడి విషయమై సారపాక మైనార్టీ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిని 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా సంఘటన జరిగిన మాట వాస్తవమేనన్నారు. విద్యార్థినులకు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించామని తెలిపారు. ఎలుకలు డ్రైనేజీ నుండి వస్తున్నాయన్న విషయాన్ని సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లి ఎలుకలు రాకుండా డ్రైనేజీని క్లోజ్ చేయించి చర్యలు తీసుకున్నామని వివరణ ఇచ్చారు. ఎలుకల దాడి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారా లేదా అని అడగ్గా చిన్న విషయమే కదా అని చెప్పలేదని చెప్పడం పట్ల పిల్లల ఆరోగ్యంపై ఏ మేరకు శ్రద్ధ చూపుతున్నారో స్పష్టమవుతోంది.



## ఉద్యోగాలు ఇస్తానని చెప్పింది నేనా అధ్యక్ష.. మా రాహుల్ గాంధీ : మాక్ అసెంబ్లీలో సీఎం తలసాని

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాక్ అసెంబ్లీ నిర్వహించగా.. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు శాసన సభ స్పీకర్‌గా వ్యవహరించారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ సభ్యులు సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి పాత్రలో తలసాని శ్రీనివాస్‌యాదవ్ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అశోక్ నగర్‌లో ఉద్యోగాలు ఇస్తానని చెప్పింది నేనా అధ్యక్ష..? ఎన్నికల ముందు అశోక్‌నగర్‌లో ఉద్యోగాలు ఇస్తమని చెప్పింది.. మా రాహుల్ గాంధీ చెప్పిండు.. ఆయనను పోయి అడగండి.. అంటూ చురకలంటించారు.హార్వర్డ్ యూనివర్శిటీలో చదువుకొని నేనేదో నేర్చుకొని మీకేదో నేర్పిద్దాం అంటే మళ్లా నాపాత భాషనే పేగులు మెడలేసుకుంటా అని మొదలు పెట్టాలా..? ఏరోస్పేస్..విమానం ఎక్కడ తయారైతది అని అంటే దిల్ సుఖ్‌నగర్.. మరి కాకపోతే ఎక్కడ అయితది.. మీ ఇంటికాడా అయితదా..? మీ కోరుట్లలో అయితదా..? కాబట్టి నాకున్న పరిజ్ఞానంతోని మావాళు చెప్పిన అంశాలనే నేను చెబుతున్నాన్నారు తలసాని.




## 'ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి'

### మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా

రుద్రంపూర్, సెప్టెంబర్ 12 : ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థుల కోసం ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ అందిస్తున్న వివిధ ఉపకార వేతనాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026?27 విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరం ప్రవేశం పొందిన ఎంబీబీఎస్, బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, బీడీఎస్, ఇంజినీరింగ్, ఇంటర్ ఒకేషనల్, డిప్లొమా కోర్సులు చదువుతున్న విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.4.50 లక్షల లోపు ఉండి, గత విద్యా సంవత్సరంలో కనీసం 60 శాతం మార్కులు సాధించిన వారు అర్హులన్నారు.ఆసక్తి గల విద్యార్థులు తాసీల్దార్ కార్యాలయం నుండి పొందిన ఆధాయ ధ్రువీకరణ పత్రం, గత సంవత్సరం పొందిన మార్కుల జాబితా, విద్యార్థి బ్యాంకు పాస్‌బుక్, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కుల ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వైద్య విద్యార్థులకు సంవత్సరానికి రూ.50 వేలు, ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.40 వేలు, డిగ్రీ విద్యార్థులకు రూ.20 వేలు, ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకు రూ.15 వేల నిర్ణీత మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేస్తారని తెలిపారు.

## జీహెచ్ఎంసీ విభజనకు అసలు కారణమేంటో చెప్పలేదు : ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ



హైదరాబాద్, సెప్టెంబర్ 12, జీహెచ్ఎంసీ విభజన బిల్లును ప్రవేశపెట్టినప్పుడు ఆయనతోపాటు అందరూ సభ్యులు జనాభా పెరుగుతోంది.. ప్రతీది పెరుగుతున్నాయి.. జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా చేయాల్సిన అవసరముందని చెప్పిన మాటలతో నేను ఏకభవించా. అలానే చేశారు బాగుంది.. అయితే మంత్రి కానీ, ప్రభుత్వం కానీ జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించేందుకు అసలు కారణం ఏంటో ఈ బిల్లులో మాత్రం ఎక్కడా చెప్పలేదన్నారు ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ.సివిల్ డిపార్ట్‌మెంట్, శానిటేషన్ డిపార్ట్‌మెంట్‌తోపాటు చాలా విభాగాలున్నాయి. ఇప్పుడు జీహెచ్ఎంసీలో ఏం జరుగుతుంది సార్.. ఒక డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే ఉద్యోగి ఇంకో డిపార్ట్‌మెంట్‌కు వెళ్లి పనిచేస్తున్నారు. ఉన్న జీహెచ్ఎంసీలోనే ఉద్యోగుల కొరత ఉంది, వేతనాలు సరిపోవట్లేదు . మరి కొత్తగా ఏర్పాటు చేసిన కార్పొరేషన్లు ఎలా నడుస్తాయి.. ఎవరైనా ఈ ప్రశ్నకు సమాధానమివ్వగలరా..? అని అక్బరుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు.జనాభా ఆధారంగా ప్రతీ కార్పొరేషన్‌లో చదరపు కిలోమీటర్‌కు అవసరమున్న ఉద్యోగులు ఎంతమంది.. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఎంతమంది సిబ్బంది అవసరం..శాటిటేషన్ విభాగంలో ఎంతమంది అనే దానిపై వివరణ ఇవ్వలేదు.. కొత్తగా ఏర్పాటు చేసిన మూడు కార్పొరేషన్లకు ఉద్యోగులు ఎంత మంది కావాలి, అంత మందిని ఎలా తెస్తారు..? అని ప్రశ్నించారు.

## బూర్గంపహాడ్ మండలంలో జోరు వర్షం



బూర్గంపహాడ్, సెప్టెంబర్ 12 : దక్షిణ చత్తీస్‌గఢ్‌లో కేంద్రీకృతమైన అల్పపీడనం కారణంగా బూర్గంపహాడ్ మండల వ్యాప్తంగా జోరు వర్షం కురిసింది. శనివారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో జనజీవనం స్తంభించింది. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావంతో ఇప్పటికే అన్నదాతలు వ్యవసాయ సాగులో ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా కురిసిన వర్షం మండలంలో వరిసాగు చేపట్టిన రైతులకు ప్రాణం పోసినట్లయింది. గత రెండు రోజులు ఎండ ప్రభావంతో ఉక్కిరిబిక్కిరయిన వృద్ధులు, చిన్నారులకు కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడి ఉపశమనం కలిగింది.

## మాల్దోవాలో చిక్కిన గ్యాంగ్‌స్టర్ అమృత్‌పాల్ సింగ్.. ఇండియాకు అప్పగింత

పంజాబ్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ అమృత్‌పాల్ సింగ్ మాల్దోవాలో పట్టుబడ్డాడు. అతడిని పంజాబ్ పోలీసులు ఇండియాకు తీసుకురానున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను పోలీసులు పూర్తి చేశారు. గ్యాంగ్‌స్టర్ అమృత్‌పాల్ సింగ్ ఇండియాలో అనేక నేరాలకు పాల్పడ్డాడు. పంజాబ్ సహా అనేక ప్రాంతాల్లో అతడిపై 21 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. అతడు 2024 అక్టోబర్‌లో చండీగఢ్ నుంచి జారీ చేసిన ఫేక్ పాస్‌పోర్టు ఉపయోగించి, ఇండియా నుంచి పారిపోయాడు.అప్పటినుంచి పంజాబ్ పోలీసులు అతడి కోసం గాలిస్తూనే ఉన్నారు. మొదట అతడు యూఏఈ వెళ్లాడు. తర్వాత అక్కడినుంచి వివిధ దేశాలకు వెళ్లిపోయాడు. చివరగా మాల్దోవా దేశం వెళ్లాడు. అక్కడినుంచి సరిహద్దు మార్గంలో ఉక్రెయిన్ వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఈ ఏడాది ఫిబ్రవరి 24న మాల్దోవా పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు అమృత్‌పాల్ సింగ్‌ను పట్టుకునేందుకు పంజాబ్‌కుచెందిన యాంటీ గ్యాంగ్‌స్టర్ టాస్క్‌ఫోర్స్ (ఏజీటీఎఫ్)తోపాటు దేశీయ ఇంటెలిజెన్స్ సంస్థలు, వివిధ దేశాల సంస్థలతో కలిసి పని చేశాయి.అతడిని పట్టుకునేందుకు ఆపరేషన్ ఈస్టర్న్ రీచ్ పేరుతో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో మాల్దోవాలో ఉన్న అతడిని తీసుకొచ్చేందుకు పంజాబ్ పోలీసులు తీవ్రంగా శ్రమించారు. కేంద్ర సంస్థలు, మాల్దావా పోలీసులతో కలిసి చర్యలు చేపట్టాయి. అతడిని ఇండియాకు అప్పగించాల్సిందిగా మాల్దోవా ప్రభుత్వాన్ని ఇండియా కోరింది. దీనికి అక్కడి కోర్టు అంగీకరించింది. మే 26న అతడిని అప్పగించేందుకు అంగీకరించింది. అయితే, ఈ నిర్ణయాన్ని అతడు పై కోర్టులో సవాలు చేశాడు. దీనిపై ఇంతకాలం విచారణ జరిగింది. చివరకు అతడి పిటిషన్‌ను కోర్టు డిస్మిస్ చేసింది.అతడిని ఇండియాకు అప్పగించాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాలతో అక్కడి చిసినౌ ఎయిర్‌పోర్టులో ఇండియాకు అప్పగించింది. సెప్టెంబర్ 12న అతడిని పంజాబ్ పోలీసులు ఇండియా తీసుకొచ్చారు. ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి ఇండియా చేరుకున్నాడు. అతడిపై నమోదైన 21 క్రిమినల్ కేసులపై విచారణ జరగనుంది.



ఇయ్యాల తెలంగాణ
ఆదివారం 13-09-2026

# మెదడు చురుగ్గా ఉండాలంటే ఈ 10 అలవాట్లు పాటించండి.!



మెదడు ఆరోగ్యంగా ఉంటే వయసు పెరిగినా జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం మెరుగ్గా ఉంటాయి. అయితే వయసు పెరిగే కొద్దీ మెదడులో సహజంగా కొన్ని మార్పులు జరుగుతాయి. దీంతో సమాచారాన్ని గ్రహించే వేగం కొంత తగ్గవచ్చు. అందుకే చిన్న వయసు నుంచే మెదడు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం మంచిదని ఎయిమ్స్‌లో శిక్షణ పొందిన న్యూరోసర్జన్ డాక్టర్ అరుణ్ ఎల్. నాయక్ సూచిస్తున్నారు. మెదడును చురుకుగా, ఆరోగ్యంగా ఉంచుకోవడానికి 10 అలవాట్లను సూచించారు. ఇవన్నీ రోజువారీ జీవితంలో సులభంగా పాటించవచ్చని ఆయన తెలిపారు.

**తగినంత నిద్ర**

న్యూరోసర్జన్ డాక్టర్ అరుణ్ ఎల్. నాయక్ ప్రకారం.. మెదడు ఆరోగ్యానికి నిద్ర చాలా ముఖ్యం. నిద్ర సమయంలో మెదడు తనను తాను పునరుద్ధరించుకునే ప్రక్రియ జరుగుతుంది. ఇది జ్ఞాపకశక్తి, నేర్చుకునే సామర్థ్యానికి కూడా ఉపయోగపడుతుంది. రోజూ 7 నుంచి 8 గంటల నాణ్యమైన నిద్రకు ప్రాధాన్యం ఇవ్వాలి.

**ఉదయపు సూర్యరశ్మి**

ఉదయం సహజమైన సూర్యరశ్మిలో కొద్దిసేపు గడపడం వల్ల శరీరంలోని జీవ గడియారం సక్రమంగా పనిచేస్తుంది. ఇది నిద్ర నాణ్యతను మెరుగుపరచడంతో పాటు మానసిక స్థితి, చురుకుదనానికి కూడా సహాయపడుతుంది. ఉదయం సుమారు 10 నిమిషాలు వెలుతురులో ఉండటం ఉపయోగకరంగా ఉంటుందని డాక్టర్ నాయక్ సూచించారు.

**స్క్వాట్స్ చేయండి**

కాళ్ల కండరాలను బలంగా ఉంచుకోవడం కూడా మెదడు ఆరోగ్యానికి మేలు చేస్తుంది. స్క్వాట్స్ వంటి వ్యాయామాలు శరీరాన్ని చురుకుగా ఉంచడంతో పాటు రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడతాయి.

**బలవర్ధక వ్యాయామాలు**

వారానికి కనీసం రెండుసార్లు బరువులు ఎత్తడం లేదా ఇతర స్ట్రెంగ్త్ ట్రైనింగ్ వ్యాయామాలు చేయడం మంచిది. ఇవి కండరాల బలాన్ని పెంచడంతో పాటు మెదడు పనితీరుకు కూడా ఉపయోగపడతాయి.

**అవసరమైతేనే సప్లిమెంట్లు**

ఒమేగా-3, బి విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు వంటి పోషకాలు శరీరానికి అవసరం. అయితే అందరూ సప్లిమెంట్లు తీసుకోవాల్సిన అవసరం లేదు. ఏదైనా పోషక లోపం ఉందో లేదో ముందుగా పరీక్షలు చేయించుకుని, వైద్యుల సూచనతో మాత్రమే సప్లిమెంట్లు తీసుకోవాలి.

**ఇతరులతో కలిసిమెలిసి ఉండండి**

కుటుంబ సభ్యులు, స్నేహితులతో మాట్లాడటం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం మెదడును చురుకుగా ఉంచుతుంది. ఎక్కువకాలం ఒంటరిగా ఉండటం మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే రోజూ కనీసం ఒక మంచి సంభాషణకు సమయం కేటాయించాలి.

**కొత్త విషయాలు నేర్చుకోండి**

కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం మెదడుకు మంచి వ్యాయామం లాంటిది. కొత్త భాష నేర్చుకోవడం, సంగీత వాయిద్యం వాయించడం లేదా కొత్త అభిరుని అలవర్చుకోవడం వంటి పనులు మెదడును చురుకుగా ఉంచడంలో సహాయపడతాయి.

**మంచి క్షణాలను ఆస్వాదించండి**

రోజువారీ జీవితంలో జరిగే మంచి విషయాలను ఆస్వాదించడానికి కొంత సమయం కేటాయించాలి. ప్రకృతిని చూడటం, ఇష్టమైన ఆహారాన్ని ప్రశాంతంగా తినడం లేదా కృతజ్ఞత భావంతో ఉండటం మానసిక ప్రశాంతతకు సహాయపడుతుంది.


**ఒత్తిడిని తగ్గించుకోండి**

ఎక్కువకాలం ఒత్తిడిలో ఉండటం జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యంపై ప్రభావం చూపవచ్చు. అందుకే యోగా, ధ్యానం, శ్వాస వ్యాయామాలు లేదా మీకు ఇష్టమైన ఇతర రిలాక్సేషన్ పద్ధతులను పాటిస్తూ ఒత్తిడిని తగ్గించుకోవాలి.

**కొంతసేపు ప్రశాంతంగా ఉండండి**

రోజులో కనీసం 10 నిమిషాలు నిశ్శబ్దంగా కూర్చోవడం లేదా ధ్యానం చేయడం మెదడుకు విశ్రాంతినిస్తుంది. ఇది ఏకాగ్రతను పెంచడంతో పాటు మానసిక ప్రశాంతతకు సహాయపడుతుంది. ఈ అలవాట్లను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా వయసు పెరిగే కొద్దీ మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడుతుంది. అయితే ఏదైనా వ్యాయామం లేదా సప్లిమెంట్‌ను ప్రారంభించే ముందు వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులను బట్టి వైద్యుల సలహా తీసుకోవడం మంచిది.

# నిద్రలో చెమటలు పడుతున్నాయా? కారణం ఇదే కావచ్చు!



రాత్రిపూట నిద్రలో చెమట పట్టడం చాలామందిలో కనిపించే సమస్యే. గది వేడిగా ఉండటం, ఎక్కువ దుప్పట్లు కప్పుకోవడం లేదా రోజంతా శారీరక శ్రమ చేయడం వల్ల చెమట పట్టడం సాధారణమే. కానీ వాతావరణం చల్లగా ఉన్నా.. ఫ్యాన్, ఏసీ పనిచేస్తున్నా నిద్రలో పదేపదే విపరీతంగా చెమట పడుతుంటే మాత్రం కారణాన్ని తెలుసుకోవడం అవసరం. కొన్ని సందర్భాల్లో ఇది శరీరంలో జరుగుతున్న మార్పులకు లేదా ఆరోగ్య సమస్యలకు సంకేతం కావచ్చని నిపుణులు చెబుతున్నారు.

**థైరాయిడ్ సమస్య ఉండొచ్చు**

థైరాయిడ్ గ్రంథి శరీర జీవక్రియను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది అవసరానికి మించి చురుగ్గా పనిచేస్తే హైపర్‌థైరాయిడిజం సమస్య వస్తుంది. ఈ పరిస్థితిలో శరీర ఉష్ణోగ్రతను తట్టుకోవడం కష్టంగా మారి ఎక్కువగా చెమట పట్టే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రాత్రివేళల్లో చెమటలు పట్టడం కూడా ఈ సమస్య లక్షణాల్లో ఒకటిగా ఉండొచ్చు.

**ఒత్తిడి, ఆందోళన కూడా కారణమే**

ఎక్కువ ఒత్తిడి, ఆందోళనకు గురైనప్పుడు శరీరంలో కొన్ని మార్పులు చోటుచేసుకుంటాయి. గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస వేగం పెరగడం, కండరాలు బిగుసుకుపోవడం వంటి లక్షణాలతో పాటు చెమట కూడా పట్టవచ్చు. మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉన్న సమయంలో నిద్రలోనూ చెమటలు పట్టే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

**మెనోపాజ్ సమయంలో**

ముఖ్యంగా 40 ఏళ్లు దాటిన మహిళల్లో రాత్రిపూట అకస్మాత్తుగా చెమటలు పట్టడం కనిపిస్తే మెనోపాజ్ దశకు సంబంధించిన మార్పులు కూడా కారణం కావచ్చు. ఈ సమయంలో ముఖం, మెడ, ఛాతి ప్రాంతాల్లో ఒక్కసారిగా వేడి అనిపించడం, ఆ వెంటనే చెమట పట్టడం వంటి సమస్యలు ఎదురవుతాయి.

**కొన్ని మందులతోనూ చెమటలు**

కొన్ని రకాల మందులు వాడుతున్నప్పుడు కూడా రాత్రిపూట చెమటలు పట్టే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా కొన్ని యాంటీడిప్రెసెంట్లు, మధుమేహానికి ఉపయోగించే మందులు, స్టెరాయిడ్లు, ఎసిటామినోఫెన్, ఆస్పిరిన్, రక్తపోటు మందులు ఇందుకు కారణం కావచ్చని నిపుణులు చెబుతున్నారు. మందులు వాడుతున్న తర్వాతే ఈ సమస్య మొదలైతే వైద్యులని సంప్రదించి వివరాలు చెప్పాలి.

**ఈ జాగ్రత్తలు పాటించండి**

రాత్రిపూట చెమటలు తగ్గించుకోవడానికి పడుకునే గదిని చల్లగా, గాలి ప్రసరణ ఉండేలా చూసుకోవాలి. నిద్రకు ముందు కెఫిన్, ఆల్కహాల్, ఎక్కువ కారంగా ఉండే ఆహారాన్ని తగ్గించడం ఉపయోగపడవచ్చు. మెనోపాజ్ దశలో ఉన్న మహిళలు కూడా ఆహారపు అలవాట్లపై శ్రద్ధ పెట్టాలి. బరువును నియంత్రణలో ఉంచుకోవడం, పోషకాహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగ్గా నిర్వహించుకోవచ్చు.

ఏదైనా మందు వాడిన తర్వాతే రాత్రిపూట చెమటలు పడుతున్నట్లు అనిపిస్తే.. ఆ మందును స్వయంగా ఆపకుండా వైద్యులని సంప్రదించాలి. అవసరమైతే ప్రత్యామ్నాయ మందులు ఉన్నాయా అనే విషయాన్ని వైద్యులని అడిగి తెలుసుకోవాలి. అలాగే ఒత్తిడి, ఆందోళన తగ్గించుకునేందుకు రోజువారీ జీవితంలో నచ్చిన పనులకు సమయం కేటాయించడం, తగినంత విశ్రాంతి తీసుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం కూడా సహాయపడుతుంది.

# గ్యాస్, గుండెపోటు మధ్య తేడా ఏంటి? ఈ విషయాలు తెలుసుకోండి

ఛాతీలో మంట, నొప్పి లేదా అసౌకర్యం కనిపించినప్పుడు చాలామంది దాన్ని గ్యాస్ సమస్యగా భావిస్తుంటారు. ముఖ్యంగా అజీర్తి, కడుపు ఉబ్బరం, వికారం వంటి లక్షణాలు ఉంటే గ్యాస్ట్రిక్ సమస్యేనని అనుకుంటారు. అయితే ఇలాంటి లక్షణాలు కొన్ని సందర్భాల్లో గుండెకు సంబంధించిన సమస్యల్లోనూ కనిపించవచ్చని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే ఛాతీలో అసౌకర్యం కలిగినప్పుడు కారణాన్ని నిర్ధారించకుండా నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరమని సూచిస్తున్నారు.

**గ్యాస్ సమస్య ఎలా ఉంటుంది?**

గ్యాస్ట్రిక్ సమస్య ఉన్నప్పుడు సాధారణంగా పొట్ట పైభాగంలో అసౌకర్యం, ఛాతీ కింది భాగంలో నొప్పి లేదా మంట కనిపించవచ్చు. కడుపు ఉబ్బినట్లు అనిపించడం, తేన్పులు రావడం, అజీర్తి వంటి సమస్యలు కూడా ఉండొచ్చు. అయితే కేవలం లక్షణాలను బట్టి ఇది గ్యాస్ సమస్యేనని ఖచ్చితంగా చెప్పడం సాధ్యం కాదు.

**గుండెపోటు లక్షణాలు ఎలా ఉంటాయి?**

గుండెకు రక్తప్రసరణ తగ్గినప్పుడు ఛాతీలో బిగుతుగా, భారంగా లేదా ఒత్తిడిగా అనిపించవచ్చు. కొందరిలో ఛాతీ నొప్పితో పాటు వికారం, తల తిరగడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. కొన్ని సందర్భాల్లో గుండె సమస్య లక్షణాలు అజీర్తి లేదా గ్యాస్ సమస్యను పోలి ఉండే అవకాశం ఉంది. అందుకే ఛాతీ నొప్పిని కేవలం గ్యాస్ అని భావించి ఇంట్లోనే ఉండిపోవడం సరికాదని నిపుణులు చెబుతున్నారు.

**ఎవరు మరింత అప్రమత్తంగా ఉండాలి?**

వయసు పెరిగేకొద్దీ గుండె సంబంధిత సమస్యలపై జాగ్రత్త అవసరం. ముఖ్యంగా మధుమేహం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, ధూమపానం, కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర వంటి అంశాలు ఉన్నవారు ఛాతీ సంబంధిత లక్షణాలను తేలిగ్గా తీసుకోకూడదు. ఛాతీలో కొత్తగా లేదా తీవ్రమైన నొప్పి రావడం, నొప్పి తగ్గకుండా కొనసాగడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చల్లటి చెమటలు, మూర్ఛ లేదా తీవ్రమైన బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అత్యవసర వైద్య సహాయం తీసుకోవాలి.

**గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే..**

రోజువారీ జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం గుండె ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది.

అధికంగా నూనె, ఉప్పు, చక్కెర ఉండే ఆహారాన్ని తగ్గించాలి.

తరచుగా జంక్‌ఫుడ్ తీసుకునే అలవాటును తగ్గించుకోవాలి.

ధూమపానం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి.

మద్యపానం విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి.

మధుమేహం, అధిక రక్తపోటు ఉంటే వైద్యుల సూచనల ప్రకారం నియంత్రణలో ఉంచుకోవాలి.తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, తృణధాన్యాలు, గింజలు వంటి పోషక పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోవాలి.

# ఇంట్లో మిగిలిపోయిన మందులను ఇలా పారేస్తున్నారా? ఈ ప్రమాదాలు తప్పవు.!




ఇంట్లో అనారోగ్యం కోసం కొనుగోలు చేసిన మందులు చికిత్స పూర్తయ్యాక మిగిలిపోతుంటాయి. కొంతకాలానికి వాటి గడువు కూడా ముగిసిపోతుంది. ఇలాంటి మందులను చాలామంది సాధారణంగా చెత్తలో పడేస్తారు. అయితే ఇలా చేయడం వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం కలగవచ్చని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.గడువు ముగిసిన మందులను నేరుగా చెత్తలో పడేయడం వల్ల.. వర్షపు నీటి ద్వారా వాటిలోని రసాయనాలు నేలలోకి, భూగర్భ జలాల్లోకి, నదుల్లోకి చేరే అవకాశం ఉంది. దీంతో నీరు కలుషితం కావడమే కాకుండా జలచరాలపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుంది. ముఖ్యంగా యాంటీబయాటిక్ మందుల అవశేషాలు పర్యావరణంలోకి చేరితే.. బ్యాక్టీరియాపై ఆ మందులు పనిచేయకుండా పోయే ప్రమాదం ఉంది. దీనినే యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ అంటారు. గడువు ముగిసిన మందులను సింక్‌లో, మురుగు కాలువలో లేదా టాయిలెట్‌లో వేయడం కూడా మంచిది కాదు. అలాగే వాటిని బయట కాల్చడం కూడా సురక్షితం కాదు. వీలైనంత వరకు గడువు ముగిసిన లేదా ఇక అవసరం లేని మందులను ఫార్మసీలు, ఆసుపత్రులు లేదా మందుల సేకరణ కేంద్రాల్లో అప్పగించడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.అలాంటి మందుల సేకరణ కేంద్రం అందుబాటులో లేకపోతే, సాధారణ మాత్రలు, క్యాప్సూల్స్‌ను నలిపి మట్టి లేదా వాడిన కాఫీ పొడి వంటి వాటితో కలిపి ఒక సంచిలో వేసి పాడేయవచ్చు. అలాగే మందుల ప్యాకెట్లపై ఉన్న పేరు వంటి వివరాలను తొలగించడం కూడా మంచిది. సూదులు, సిరంజిలను సాధారణ చెత్తలో వేయకుండా ప్రత్యేక షార్ప్స్ కంటైనర్‌లో వేయాలి. క్యాన్సర్ మందులు, ఇంజెక్షన్లు, ఓపియాయిడ్లు వంటి అధిక ప్రమాదకర మందులను తప్పనిసరిగా ఆసుపత్రి లేదా ఫార్మసీకి తిరిగి ఇవ్వడం సురక్షితమని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

# మద్యం తాగకపోయినా ఫ్యాటీ లివర్ సమస్య ఎందుకు వస్తుంది? అసలు కారణాలివే.!



కాలేయం మన శరీరంలో చాలా ముఖ్యమైన అవయవం. జీర్ణక్రియకు సహాయపడటం, వ్యర్థ పదార్థాలను తొలగించడం, రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడం వంటి ఎన్నో పనులను కాలేయం చేస్తుంది. అయితే ప్రస్తుతం చాలా మందిలో కాలేయంలో కొవ్వు పేరుకుపోయే ఫ్యాటీ లివర్ సమస్య కనిపిస్తోంది. ముఖ్యంగా మద్యం తాగని వారిలో కూడా ఈ సమస్య పెరుగుతోంది.ఆరోగ్య నిపుణుల సమాచారం ప్రకారం.. మద్యం సేవించకపోయినా కాలేయంలో కొవ్వు పేరుకుపోవడానికి ప్రధాన కారణం జీవక్రియలో వచ్చే మార్పులు, అనారోగ్యకరమైన ఆహారం, వ్యాయామం లేకపోవడం వంటి కారణాలే. ఈ పరిస్థితిని మెటబాలిక్ డిస్‌ఫంక్షన్-అసోసియేటెడ్ స్టీటోటిక్ లివర్ డిసీజ్ అంటారు. గతంలో దీనిని ఔంఈఒఆ అని పిలిచేవారు.ముఖ్యంగా పొత్తికడుపు చుట్టూ కొవ్వు పెరగడం, అధిక బరువు, టైప్-2 డయాబెటిస్, కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు (రక్తంలో ఉండే ఒక రకమైన కొవ్వు) పెరగడం, ఇన్సులిన్ నిరోధకత వంటి సమస్యలు ఫ్యాటీ లివర్ ప్రమాదాన్ని పెంచుతాయి. బయటకు సన్నగా కనిపించే వారిలో కూడా శరీరం లోపల కొవ్వు ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది.తెల్ల బియ్యం, స్వీట్లు, చక్కెర పానీయాలు, వేయించిన పదార్థాలు, ప్యాక్ చేసిన ఆహారాన్ని తరచుగా తీసుకోవడం, ఎక్కువసేపు కూర్చోవడం, వ్యాయామం చేయకపోవడం, నిద్ర సరిగా లేకపోవడం కూడా సమస్యకు కారణం కావచ్చు. ఫ్యాటీ లివర్ ప్రారంభ దశలో సాధారణంగా ఎలాంటి లక్షణాలు కనిపించకపోవచ్చు. కొందరికి అలసట, నీరసం లేదా పొత్తికడుపు కుడివైపు పైభాగంలో అసౌకర్యం ఉండొచ్చు. వ్యాధి తీవ్రంగా మారితే కాళ్లు, పొత్తికడుపు వాపు, కామెర్లు వంటి లక్షణాలు కనిపించవచ్చు. అందుకే జీవనశైలిలో మార్పులతో పాటు అవసరమైతే వైద్యుల సలహా తీసుకోవడం ముఖ్యం.

# రాత్రంతా మొబైల్ చూస్తున్నారా? నిద్రలేమితో ఈ ముప్పులు తప్పవు!

ఈ రోజుల్లో చాలామందికి రాత్రిపూట ఎక్కువసేపు ఫోన్ చూసే అలవాటు ఉంది. అయితే శరీరానికి సరిపడా నిద్ర చాలా అవసరం. నిద్రను నిర్లక్ష్యం చేస్తే ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. రాత్రిపూట తగినంత నిద్ర లేకపోవడం వల్ల అలసట, చిరాకు, తలనొప్పి, ఏకాగ్రత తగ్గడం, జ్ఞాపకశక్తిపై ప్రభావం వంటి సమస్యలు రావచ్చు. దీర్ఘకాలంగా నిద్రలేమి కొనసాగితే మధుమేహం, అధిక రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు, మానసిక ఆరోగ్య సమస్యలు వంటి అనేక అనారోగ్య సమస్యల ప్రమాదం పెరగవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నిద్ర అనేది మన శరీరానికి విశ్రాంతి ఇవ్వడమే కాదు. మనం నిద్రపోతున్న సమయంలో శరీరం, మెదడు కోలుకునే ప్రక్రియ జరుగుతుంది. అందుకే రోజూ తగినంత నిద్రపోవడం చాలా ముఖ్యం.

**రాత్రిపూట నిద్ర ఎందుకు ముఖ్యం?**



రోజంతా పనిచేసిన తర్వాత శరీరం, మెదడు అలసిపోతాయి. దీంతో విశ్రాంతి అవసరమని శరీరం మనకు నిద్ర రూపంలో సంకేతం ఇస్తుంది. రాత్రిపూట నిద్రపోయే సమయంలో శరీరానికి అవసరమైన అనేక పునరుద్ధరణ ప్రక్రియలు జరుగుతాయి. అయితే రాత్రంతా మేల్కొని ఉండి, పగటిపూట నిద్రపోవడం వల్ల శరీర సహజ నిద్ర చక్రం దెబ్బతినే అవకాశం ఉంది.మన శరీరానికి ఒక సహజ జీవ గడియారం ఉంటుంది. దీనినే సర్కేడియన్ రిథమ్ అంటారు. పగలు మెలకువగా, రాత్రి నిద్రపోయే విధంగా ఈ వ్యవస్థ మన శరీరాన్ని నియంత్రిస్తుంది. రాత్రిపూట ఎక్కువసేపు మేల్కొని ఉండటం వల్ల ఈ సహజ నిద్ర చక్రం గందరగోళానికి గురవుతుంది. అందుకే రోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, తగినంతసేపు నిద్రపోవడం, రాత్రివేళ ఫోన్, కంప్యూటర్ వినియోగాన్ని తగ్గించడం మంచిది.

**ఆరోగ్యకరమైన నిద్ర కోసం..**

రాత్రి వేళల్లో వీలైనంత ప్రశాంతమైన వాతావరణంలో నిద్రపోవాలి. నిద్రకు ముందు మొబైల్, టీవీ, కంప్యూటర్ వినియోగాన్ని తగ్గించాలి. రోజూ ఒకే సమయానికి పడుకోవడం, ఉదయం ఒకే సమయానికి నిద్రలేవడం అలవాటు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# పాదయాత్రే.. సర్వరోగనివారిణి....

విజయవాడ, సెప్టెంబర్ 12, ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల క్యాడర్‌తో, నేతలతో మాట్లాడేటప్పుడు కళ్లు మూసుకుందాం.. కాలం గడిచిపోతుంది అనే ఊతపదాన్ని పదే పదే వాడుతుండటం తీవ్ర చర్చనీయాంశమవుతోంది. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని నిత్యం క్షేత్రస్థాయిలో ఎండగట్టడం, ప్రజల్లో ఉండి నిరసనలు చేయడం కంటే.. ఐదేళ్ల కాలాన్ని దాటవేయడమే ప్రధాన వ్యూహంగా ఆయన భావిస్తున్నట్లు కనిపిస్తోంది. మరో ఏడాది ఓపిక పడితే కళ్లు మూసుకునేలోపు పాదయాత్ర సమయం వచ్చేస్తుందని, ఆ ఒక్క పాదయాత్ర చేస్తే చాలు మళ్లీ ఓటర్లు బ్రహ్మరథం పడతారని క్యాడర్‌కు నూరిపోస్తున్నారు. అయితే, వైసీపీ ప్రస్తుతం ఎదుర్కొంటున్న తీవ్రమైన రాజకీయ, సంస్థాగత సమస్యలకు పాదయాత్ర అనేది సర్వరోగ నివారిణి అని జగన్ నమ్మడం ఎంతవరకు సమంజసం?ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో పాదయాత్రలకు ఒక ప్రత్యేకమైన గ్లామర్, ఆకర్షణ ఉండేవి. వైఎస్ రాజశేఖర రెడ్డి, చంద్రబాబు నాయుడు, ఆ తర్వాత వైఎస్ జగన్ చేసిన పాదయాత్రలు వారిని అధికార పీఠం ఎక్కించాయన్నది పచ్చి నిజం. కానీ, ఒకే రాజకీయ వ్యూహం ప్రతిసారీ పలికిస్తుందనుకోవడం పొరపాటే. 2019 నాటికి ఉన్న పరిస్థితులు, సోషల్ మీడియా ప్రభావం, ఓటర్ల మానసిక స్థితి వేరు.. నేటి పరిస్థితులు వేరు. ఒకప్పుడు పర్యటనల ద్వారా ప్రజలను కలవడం కొత్తగా ఉండేది, కానీ ఇప్పుడు డిజిటల్ యుగంలో నాయకుడి ప్రవర్తన, ప్రతిస్పందనలు ప్రతిరోజూ ప్రజల వద్దకే చేరుతున్నాయి. కేవలం ఎన్నికల ముందు ఐదు వేల కిలోమీటర్లు నడిచేస్తే అధికార పీఠం దక్కేంత అమాయకంగా నేటి ఓటర్లు లేరు.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడటం, క్షేత్రస్థాయిలో కేడర్‌ను ముందుకు నడిపించడం ప్రధాన బాధ్యత. కానీ, "కళ్లు మూసుకుంటే ఐదేళ్లు గడిచిపోతాయి అనే ధోరణి పార్టీ ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని, కార్యకర్తలను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చోటుచేసుకుంటున్న పరిణామాలు,



కేసులు, స్థానిక వివాదాల్లో తమకు అండగా నిలబడే నాయకత్వం కరువైందనే భావన వైసీపీ శ్రేణుల్లో ఉద్భవిస్తోంది. ప్రజా పోరాటాలు చేయకుండా, కేవలం తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమై ఎన్నికల ముందు వస్తా అని చెప్పడం వల్ల పార్టీ క్షేత్రస్థాయి పునాదులు మరింత బలహీనపడే ప్రమాదం ఉందనే విశ్లేషణలు వస్తున్నాయి.నేటి ఓటర్లు, ముఖ్యంగా జెన్ జీ, తటస్థ ఓటర్లు ఒక నాయకుడు నిరంతరం ఎలా స్పందిస్తున్నాడు, అసెంబ్లీకి వెళ్తున్నారా లేదా, ప్రజా సమస్యలపై ఎలాంటి ప్రతిపాదనలు ఇస్తున్నారనేది గమనిస్తున్నారు. 2019లో ఇచ్చిన హామీలు, ఆ తర్వాత ఐదేళ్ల పాలనను అనుభవించిన ప్రజలు, ఇప్పుడు కేవలం ఓదార్పులు లేదా సుదీర్ఘ నడకలకే ఓటేస్తారని భావించడం రాజకీయ అపరిపక్వత కిందకే వస్తుంది. పాదయాత్రలకు ఉన్న వాల్యూ కాలక్రమేణా తగ్గిపోయింది. పవన్ కల్యాణ్ చేసిన వారాహి యాత్ర లేదా లోకేష్ చేసిన యువగళం పాదయాత్రలు సైతం సాంప్రదాయ పాదయాత్రల రూపురేఖలను మార్చేశాయి. ఈ నేపథ్యంలో జగన్ పాత తరహా పాదయాత్రనే మళ్లీ నమ్ముకోవడం పెద్ద రిస్క్.వైసీపీ ఎదుర్కొంటున్న అసలు సమస్య పాదయాత్ర లేకపోవడం కాదు. ప్రతి చిన్న విషయానికీ అధినేతపైనే ఆధారపడే సంస్కృతి ఉంది. ఇలాంటి సమయంలో కళ్లు మూసుకుందాం అనే మంత్రం జపిస్తే.. రాబోయే రోజుల్లో క్షేత్రస్థాయిలో పార్టీ ఉనికికే ప్రమాదం వస్తుంది. ప్రతిపక్ష హోదా కూడా దక్కని స్థితిలో ఉన్న పార్టీకి, నిరంతర ప్రజా ఉద్యమాలే ఊపిరి పోస్తాయి తప్ప, రాబోయే పాదయాత్ర కోసం చేసే నిరీక్షణ కాదు. జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర ను ఒక మాయాజాలంగా భావిస్తున్నారు. కానీ రాజకీయాల్లో కాలం దానంతట అదే మాయలు చేయదు. ప్రజా సమస్యలపై పోరాడకుండా, కేవలం కళ్లు మూసుకుని కాలం గడిపేస్తే మళ్లీ జనం ఓటేస్తారనుకోవడం రాజకీయ భ్రమ మాత్రమే. 2029 నాటికి రాజకీయ సమీకరణాలు, జనాభా మార్పులు, ఓటర్ల ప్రాధాన్యతలు ఎలా ఉంటాయో అంచనా వేయకుండా, ఒకే సెంటిమెంట్‌ను పదే పదే నమ్ముకుంటే అది వైసీపీకే పెద్ద దెబ్బగా మారే అవకాశం ఉందనేది రాజకీయ విశ్లేషకుల స్పష్టమైన అభిప్రాయం

# నాగబాబుకు జోడు పదవుల రచ్చ..



గుంటూరు, సెప్టెంబర్ 12, జనసేన పార్టీ ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ, ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ (కేబినెట్ హోదా) కొణిదెల నాగబాబు చిక్కుల్లో పడ్డారా?. ఆయనకు జోడు పదవుల వివాదం తలనొప్పిగా మారబోతుందా?. సోషల్ మీడియా వేదికగా అదే చర్చ జరుగుతోంది.. జోడు పదవుల అంశం తెరపైకి వచ్చింది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం జోడు పదవులు ఉండకూడదంటూ సోషల్ మీడియా వేదికగా కొత్త చర్చ మొదలైంది. గతంలో జయా బచ్చన్‌పై జోడు పదవులతో అనర్హత వేటు పడిందని.. ఎమ్మెల్సీగా ఉన్న నాగబాబుపై అనర్హత వేటు పడుతుందని కొందరు ట్వీట్‌లు చేశారు.ఏపీ ప్రభుత్వం ఎమ్మెల్సీ నాగబాబును ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా నియమించి కేబినెట్ హోదా కల్పించింది. ఆయన జీతభత్యాలు, అలవెన్సులకు సంబంధించి జీవోలో పేర్కొన్నారు. అయితే ఏదైనా ఉభయ సభల్లో సభ్యులుగా ఉన్నవారు ఇతర లాభదాయక పదవుల్లో ఉండకూడదని రాజ్యాంగంలో స్పష్టంగా ఉందని ఓ నెటిజన్ ట్వీట్ చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 191(1)(ఏ)ని గుర్తు చేశారు.. ఒక వ్యక్తి అటు కేంద్ర ప్రభుత్వంలో కానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వంలో కానీ లాభదాయకమైన పదవిలో ఉంటే.. వారి రాష్ట్ర శాసనసభ లేదా శాసనమండలి సభ్యుడిగా పదవిలో కొనసాగడానికి అనర్హుడవుతారని రాజ్యాంగంలో స్పష్టం ఉందని పేర్కొన్నారు. ఈ నిబంధనను ఉల్లంఘిస్తూ ఎమ్మెల్సీ నాగబాబుకు కేబినెట్ హోదా, నెలకు 3.80 లక్షల రూపాయల జీతభత్యాలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది నూటికి నూరు శాతం ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ (లాభదాయక పదవి) కిందకు వస్తుంది కాబట్టి ఎమ్మెల్సీ నాగబాబు మీద అనర్హత వేటు పడుతుందని చెప్పుకొచ్చారు. నాగబాబుకు ఎమ్మెల్సీ పదవి ఉండగానే మళ్లీ ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ పదవి కేబినెట్ ర్యాంకుతో ఇవ్వడం, వేతనం పొందడం రాజ్యంగ విరుద్ధమనేది కొందరి వాదన.. ఇదే అంశాన్ని ట్వీట్‌లో ప్రస్తావించారు.గతంలో జయాబచ్చన్‌పై ఇలాగే అనర్హత వేటు పడిందంటున్నారు. జయా బచ్చన్ గతంలో సమాజ్‌వాదీ పార్టీ నుంచి రాజ్యసభ ఎంపీగా ఉన్న సమయంలో.. మళ్లీ ఉత్తరప్రదేశ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఛైర్‌పర్సన్‌గా కూడా పనిచేశారు. భారత రాజ్యాంగం ప్రకారం ఈ పదవి ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ (లాభదాయక పదవి) పరిధిలోకి వస్తుందని ఎన్నికల సంఘం పేర్కొంది. జయా బచ్చన్ రాజ్యసభ ఎంపీ పదవిపై మార్చి 2006లో అనర్హత వేటు పడింది. జయా బచ్చన్ మాత్రమే కాదు మరికొన్ని ఉదాహరణలు ఉన్నాయని చెబుతున్నారు.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 191(1)(ఏ) ప్రకారం.. ఒక ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా ఉన్న వ్యక్తి ప్రభుత్వం నుంచి వేతనం, ప్రతిఫలం వచ్చే మరో లాభదాయక పదవి (ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్)లో ఉండకూడదు. ఒకవేళ లాభదాయక పదవిని చేపడితే ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ పదవిపై అనర్హత వేటు పడే అవకాశం ఉంటుంది. ఈ రూల్‌నే ప్రధానంగా నాగబాబు విషయంలో ప్రస్తావిస్తున్నారు. అదే సమయంలో నాగబాబుపై అనర్హత వేటు పడకుండా ఏపీ ప్రభుత్వానికి మరో వెసులుబాటు కూడా ఉందనే వాదన వినిపిస్తోంది. ఇక్కడ మినహాయింపు చట్టాన్ని ప్రధానంగా గుర్తు చేస్తున్నారు. ఈ చట్టం ప్రకారం.. రాష్ట్ర అసెంబ్లీలో ప్రత్యేకంగా చట్టం చేసి కొన్ని పదవులకు ఈ అనర్హత నుంచి మినహాయింపు ఇచ్చే అధికారం కూడా ఉందని కొందరు గుర్తు చేస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ వేతనాలు, పింఛన్ల చెల్లింపు అనర్హతల తొలగింపు చట్టం, 1953 ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని కార్పొరేషన్లు, సొసైటీలు, కమిటీల ఛైర్మన్ పదవులను ఈ మినహాయింపు జాబితాలో చేరుస్తుంది. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నాగబాబు ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ పదవిని.. అనర్హతల తొలగింపు చట్టం ప్రకారం.. మినహాయింపు పొందిన పదవిగా గుర్తించాల్సి ఉంటుంది. అప్పుడు న్యాయపరంగా ఎలాంటి చిక్కులు ఉండవనే మరో వాదన తెరపైకి వచ్చింది. రెండు పదవుల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు ఒక పదవికి మాత్రమే ఆర్థిక వేతనం తీసుకోవడం, రెండో పదవికి అలవెన్సులను కేవలం అధికారిక ఖర్చులకు మాత్రమే పరిమితం చేయొచ్చు. అప్పుడు లాభదాయక పదవి వివాదం రాకుండా చూడొచ్చు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాగబాబు పదవిని అనర్హతల తొలగింపు చట్టం పరిధిలోకి తీసుకొచ్చినా.. నిబంధనల ప్రకారం ఆర్థిక ప్రయోజనాల విషయంలో మార్పులు చేస్తే చట్టబద్ధమైన పదవిగా మారుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రస్తావిస్తున్న అంశాలపై ఏపీ ప్రభుత్వం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

# వాల్తేరు డిపో వద్ద ఆర్టీసీ బస్సు పూర్తిగా దగ్ధం

విశాఖపట్నం:విశాఖ నగరంలో శనివారం తెల్లవారుజామున ఒక భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది నెల్లూరు నుంచి ప్రయాణికులతో విశాఖ పట్నం చేరుకున్న ఒక ఏపీఎస్ఆర్టీసీ (ంఖూఖీఅ) బస్సు వాల్తేరు డిపో సమీపంలో నిలిపి ఉంచగా ఆకస్మాత్తుగా మంటలు అంటుకుని నిమిషాల వ్యవధిలోనే పూర్తిగా దగ్ధ మైంది నెల్లూరు నుంచి సుదీర్ఘ ప్రయాణం తర్వాత ఈ బస్సు విశాఖకు చేరు కుంది అనంతరం వాల్తేరు డిపో వెలుపల బస్సును నిలిపి ఉంచారు అయితే, శనివారం తెల్లవారు జామున ఒక్కసారిగా బస్సు ఇంజిన్ భాగం నుండి దట్టమైన పొగలు, మంటలు వ్యాపించాయి. బస్సు ఖాళీగా ఉన్న సమ యంలోనే ఈ ప్రమాదం జరగడంతో ఒక పెద్ద ముప్పు తప్పింది నిమిషాల వ్యవధిలోనే మంటలు బస్సు మొత్తానికి విస్తరించి వాహనం పూర్తిగా దగ్ధం అయ్యింది బస్సు తగల బడుతున్న విషయాన్ని గమనించిన స్థానికులు సిబ్బంది వెంటనే పోలీసుల కు,అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు ఘటనా స్థలానికి చేరు కున్న ఫైర్ సిబ్బంది ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపు చేశారు ఆర్టీసీ ఉన్నతాధి కారులు,పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీ లించారు బస్సులో మంటలు చెలరేగడానికి షార్ట్ సర్క్యూట్ కారణమా లేదా మరేదైనా సాంకేతిక లోపమా అనే కోణంలో పోలీసులు ఆర్టీసీ సాంకేతిక విభాగం అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు ఈ ప్రమాదం లో ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం తో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

# రేసులోకి వచ్చిన ఆనం

నెల్లూరు సెప్టెంబర్ 12, నెల్లూరు జిల్లాకు చెందిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రస్తుతం యాక్టివ్ పాలిటిక్స్‌లోనే ఉన్నారు. ఆయన రాజకీయ రిటైర్మెంట్ ప్రకటించలేదు. అయితే.. ఆయన రిటైర్ అవుతున్నారని.. ఆయన వారసుడు ఎవరు ? అంటూ.. రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఆత్మకూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తూ, కూటమి ప్రభుత్వంలో దేవాదాయ శాఖ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఆనం విషయం తరచుగా తెరమీదికి వస్తోంది. దెబ్బకు డిలీట్ ఆయన వచ్చే ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకొంటున్నారని చెబుతున్నారు. కానీ, ఆనం ఎక్కడా అసలు ఈ విషయం చెప్పలేదని అంటున్నారు. రిటైర్మెంట్ గురించిన వార్తలు కేవలం ఊహాగానాలు మాత్రమేనని అంటున్నారు. మంత్రిగా ఆయన ప్రస్తుతం ఆత్మకూరు పట్టణ, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి పనుల్లో



(రోడ్ల విస్తరణ, క్రీడా ప్రాంగణాలు, మౌలిక సదుపాయాల కల్పన వంటివి) పూర్తిస్థాయిలో నిమగ్నమై ఉన్నారు. దీంతో ఇప్పుడు ఆనం యూటర్న్ తీసుకున్నారన్నది రాజకీయ వర్గాల్లో జరుగుతున్నచర్చ.మరో మూడేళ్ల తర్వాత.. పోటీకి రెడీ కాలేరన్న వాదన సహజం. అయితే.. ఆత్మకూరుతో తనకు ఉన్న బంధం నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లోనూ పోటీకి రెడీ అవుతానంటూ.. తన అనుచరులకు చెపుతున్నారట. కాబట్టి ప్రస్తుతానికి ఆత్మకూరు బరిలో వేరే వారు వస్తారనే ప్రశ్నే లేదు; ఆయనే అక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఆయనే పోటీ చేయనున్నారు.. అని అంటున్నారు.టీడీపీ ఆలోచన మరో విధంగా ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం ఆనం.. టీడీపీ తరఫున ఆత్మకూరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే.. వచ్చే ఎన్నికల నాటికి యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ నిర్ణ యించింది. ప్రధానంగా.. నారా లోకేష్ నాయకత్వాన్ని పెంచే దిశగా సమాలోచనలు చేస్తున్న దరిమిలా.. వృద్ధ నేతలను పక్కన పెట్టే ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆనంను నామినేటెడ్‌పదవికి షిఫ్టు చేసి.. ఆత్మకూరును వేరే వారికి ఇచ్చే ఆలోచనలో ఉన్నారన్నది స్థానికంగా జరుగుతున్న చర్చ. కానీ, ఆనం మాత్రం.. ఈ విషయాలు వెలుగు చూస్తున్న క్రమంలో మరింత యాక్టివ్ అవుతుండడం గమనార్హం.

# చిన్న శీను ఓపెనర్ మాత్రమే!

విజయనగరం, సెప్టెంబర్ 12, ఉత్తరాంధ్ర రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. దీనికి క్షేత్రస్థాయి పరిణామాలు బలం చేకూరుస్తున్నాయి. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో దశాబ్దాల పాటు రాజకీయాన్ని శాసించిన ఉద్దండులైన సీనియర్ నేతలు సైతం ఇప్పుడు వైసీపీ జెండా మోసేందుకు వెనుకంజ వేస్తున్నారు. గత ఎన్నికల్లో అధికార దర్పం, అపరిమితమైన ఆర్థిక బలం, పటిష్టమైన యంత్రాంగం ఉండి కూడా దాదాపుగా ప్రతి నియోజకవర్గంలో 50 వేల ఓట్లకు పైగా భారీ వ్యత్యాసంతో ఓడిపోవడం సదరు నేతల ఆత్మవిశ్వాసాన్ని కోలుకోలేని దెబ్బతీసింది. ఆ ఘోర పరాభవం తర్వాతే అనేకమంది సీనియర్లు సైలెంట్ అయిపోగా, మరికొందరు ఇప్పటికే పార్టీకి గుడ్ బై చెప్పారు.ఉత్తరాంధ్ర సామాజిక సమీకరణాలను, ప్రజల ఆలోచనా ధోరణిని నిశితంగా పరిశీలిస్తే.. వైఎస్ఆర్‌సీపీ మళ్లీ పూర్వవైభవాన్ని పుంజుకోవడం దాదాపు అసాధ్యమనే భావన రాజకీయ వర్గాల్లో బలంగా నాటుకుపోయింది. దీంతో తమ సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పరిస్థితిని ముందే అంచనా వేసిన సీనియర్ నాయకులు ఒక వ్యూహాత్మక నిర్ణయానికి వచ్చారు. తాము ప్రత్యక్ష రాజకీయాల నుంచి గౌరవప్రదంగా రిటైర్మెంట్ ప్రకటించడం లేదా క్రియాశీల పాత్ర నుంచి తప్పుకోవడం ఒక మార్గమైతే.. తమ వారసులను, ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని కూటమి పార్టీలైన టీడీపీ లేదా జనసేనలోకి పంపించడం మరో ప్రత్యామ్నాయంగా ఎంచుకుంటున్నారు.ముఖ్యంగా విజయనగరం, విశాఖ జిల్లాల్లో బారీ స్థాయిలో సాగుతున్న ఈ వలసలు కేవలం ఆరంభం మాత్రమే. స్థానిక సంస్థల ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ప్రాదేశిక, పురపాలక వర్గాల్లో ఉనికి కాపాడుకోవడానికి స్థానిక నేతలు డిఫెన్స్‌లో పడ్డారు. వైసీపీ గుర్తుపై పోటీ చేస్తే గెలుపు అవకాశాలు శూన్యమని భావిస్తున్న వీరు, కూటమిలోని ఏ పార్టీ తలుపు తడితే ఆ పార్టీలో చేరేందుకు సిద్ధపడుతున్నారు. అధికారంలో ఉన్న కూటమి మద్దతు లేకుండా క్షేత్రస్థాయిలో రాజకీయాలు చేయడం సాధ్యం కాదనే స్పష్టత రావడంతో, క్యాడర్ మొత్తం ఒక్కొక్కటిగా ఖాళీ అవుతోంది.పార్టీ కేంద్రీకృత నాయకత్వ శైలి, ఎన్నికల ఫలితాల తర్వాత కనీస దిశానిర్దేశం లేకపోవడం కూడా ఈ సీనియర్ల నిష్క్రమణకు వేగవంతం చేస్తోంది. ఏ రాజకీయ పార్టీకైనా క్షేత్రస్థాయి నాయకులే ఆయువుపట్టు. కానీ ఉత్తరాంధ్ర వ్యాప్తంగా అగ్రనేతల నుంచి క్షేత్రస్థాయి ప్రసిద్ధ ముఖాల వరకు అందరూ జెండా ఎత్తేస్తుండటంతో వైసీపీ పూర్తిగా దెబ్బతింది. రాబోయే స్థానిక పోరు ముగిసేనాటికి ఉత్తరాంధ్రలో వైఎస్ఆర్‌సీపీ బోర్డు తిప్పేయడం లేదా నామమాత్రపు స్థానానికి పరిమితం కావడం ఖాయంగా కనిపిస్తోంది.

# వంద శాతం స్ట్రైక్ రేట్ పై దృష్టి

తిరుపతి, సెప్టెంబర్ 12,ఏపీలో స్థానిక సంస్థల వేడి రాజుకుంది. అయితే సాధారణంగా ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులు ముందుగా తమ ఆసక్తిని వ్యక్తం చేస్తారు. అలా కూటమిలోని మూడు పార్టీలలో ఔత్సాహికులు తమ అభిలాషను వ్యక్తం చేస్తున్నారు. అయితే అధికారికంగా ఎవరూ బయటకు చెప్పలేకపోతున్నారు. దానికి కూడా కూటమిగా ఉండడం. ఎవరికి వారుగా ముందుగా ప్రకటించుకోవద్దని తమ పార్టీల నాయకులకు కూటమి పార్టీల అధినాయకత్వాలు హెచ్చరించిన నేపథ్యం ఉంది. అదే సమయంలో సీట్లు ఎవరికి ఎంత శాతం అన్న లెక్క ముందు తేల్చుకోవాలని చూస్తున్నారు. ఐక్యంగా పోటీ చేయడానికే కూటమి పార్టీలు సూత్రప్రాయంగా నిర్ణయించాయి. దాంతో సర్దుబాటు కోసం సీట్ల విషయంలో చర్చకు మూడు పార్టీల అధినాయకత్వాలు కలిసి చర్చించడానికి సిద్ధపడుతున్నాయి ఇక కూటమి పార్టీలలో ముఖ్యమైన మిత్ర పక్షం జనసేన. ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రకృతి వైద్యం కోసం కేరళం వెళ్ళిన సంగతి విధితమే. ఆయన ఇపుడు అక్కడే ఉన్నారు. ఆయన ఎపుడు వస్తారు అంటే ఎవరికి వారికి ఊహాగానాలు ఉన్నాయి. అయితే తాజాగా జనసేన పార్టీ సామావేశంలో ఆ పార్టీ సీనియర్ నేత మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఈ నెల 15న పవన్ వస్తారు అని చెప్పడం జరిగింది. ఆయన పార్టీ ఆఫీసుకి వచ్చి స్థానిక సంస్థల ఎన్నికల మీద సమీక్షలు నిర్వహిస్తారు అని చెప్పారు. పవన్ బీ ఫారాలు ఇస్తారని ఆయన సంతకం చేసిన బీ ఫారాలు ఉన్న వారే అభ్యర్థులుగా ఉంటారని ఈ లోగా ఎవరు పోటీ చేస్తామని ప్రకటించుకున్నా అది తొందరపాటు వ్యక్తిగతం అవుతుందని అంటున్నారు. దాంతో పవన్ వచ్చాక కూటమి నేతల మధ్య సీట్ల సర్దుబాటు విషయంలో చర్చలు జరుగుతాయని అంటున్నారు మరో వైపు చూస్తే బీజేపీ కూడా సీట్ల సర్దుబాటు విషయంలో ఫోకస్ పెట్టింది అని అంటున్నారు. ఆ పార్టీ కూడా కూటమితో పొత్తులో ఉంటే గణనీయంగా సీట్లు గెలుచుకోవచ్చు అని భావిస్తోంది. ఈసారి ఆ పార్టీ నుంచి కూడా అనేక మంది పోటీకి తయారుగా ఉన్నారు. విశాఖ, రాజమండ్రి మేయర్ సీట్ల కోసం బీజేపీ పట్టుబడుతోంది. అలాగే జెడ్పీల విషయానికి వస్తే అల్లూరి జిల్లాతో పాటు గోదావరి జిల్లాలు కోస్తాలో కొన్ని కోరుకుంటోంది అని అంటున్నారు. ఈ ప్రచారం ఇలా ఉండగానే స్థానిక ఎన్నికల విషయంలో ఏపీ బీజేపీ ప్రెసిడెంట్ పీవీఎన్ మాధవ్ స్పందించారు. స్థానిక ఎన్నికల్లో సీట్ల పంపకాలపై క్లారిటీ రాలేదు అని ఆయన చెప్పడం విశేషం. రానున్న మూడు రోజులలో కూటమి పార్టీలు కూర్చుని చర్చిస్తామని చెప్పారు. అలాగే స్థానిక ఎన్నికల పోటీ విధివిధానాలపై చర్చ ఉంటుందని అన్నారు. ఈసారి బీజేపీ నుంచి కూడా వంద శాతం స్ట్రైక్ రేట్ కోసం ప్రయత్నిస్తామని మాధవ్ చెప్పడం విశేషం. స్థానిక ఎన్నికలపై ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ స్పందన చూస్తే మరో మూడు రోజులలో కూటమి పార్టీలు కలిసి కూర్చుని చర్చిస్తాయని క్లారిటీ అయితే వచ్చింది. వినాయకచవితి పండుగ దగ్గరలో ఉంది. అది అయిన తరువాత ఈ నెల 16న చంద్రబాబు పవన్ కళ్యాణ్ మాధవ్ సీట్ల సర్దుబాటు గురించి కీలక చర్చలు జరుపుతారని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# లారీని ఢీకొన్న బస్సు..క్లీనర్ మృతి

ఏలూరు ,చింతలపూడి మండలం యండపల్లి సమీపం లో గ్రీన్ ఫీల్డ్ హైవే పై ప్రైవేట్ ట్రావెల్ (ంఖ39చిఖీ3178) బస్సు కు ప్రమాదం జరిగింది. ఆగిఉన్న లారీని (ఐం56.8893) బస్సు ఢీకొంది. ఘటనలో ఒకరు మృతిచెందారు. పదిహేను మందికి పైగా గాయలు అయినట్లు సమాచారం. బస్సు హైదరాబాద్ నుండి విజయనగరం వెళ్తున్నట్లు ప్రయాణికులు తెలిపారు. మృతడు బస్సు క్లీనర్ గా గుర్తించారు. చింతలపూడి సర్కిల్ ఇన్స్పెక్టర్ క్రాంతికుమార్, ఎస్ ఐ సతీష్ ఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# స్పోర్ట్స్ న్యూస్

## ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యంత అవమానకర గోల్..




క్రీడల్లో అప్పుడప్పుడు జరిగే కొన్ని అరుదైన, విచిత్ర ఘటనలు మనల్నీ ఆశ్చర్యానికి గురి చేస్తాయి తాజాగా బ్రెజిల్ సెకండ్ డివిజన్ లీగ్‌లో జరిగిన ఓ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో కూడా వింత ఘటన చోటుచేసుకుంది. స్పోర్ట్ రెసిఫ్, నోవోరిజోంటినో జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో.. ప్రత్యర్థి జట్టు బంతిని తాకకుండానే కేవలం నిమిషాల వ్యవధిలో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. స్పోర్ట్స్ రెసిఫ్ డిఫెండర్ చేసిన బ్యాక్ పాస్ కారణంగా ప్రత్యర్థికి గోల్ లభించింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.స్పోర్ట్ రెసిఫ్ జట్టు డిఫెండర్ అలీసన్ కాసియానో బంతిని తమ ఆధీనంలో ఉంచుకోవాలని భావించాడు. ఈ క్రమంలో సహచర ప్లేయర్లకు బంతిని పాస్ చేశాడు. మరికొద్ది సమయం తర్వాత తిరిగి అతడి వద్దకే బంతి వచ్చింది. ఈ క్రమంలో బంతిని గోల్‌కీపర్ కైక్ ఫ్రాంకాకు ఇవ్వాలని భావించాడు. అయితే కీపర్ సరైన స్థానంలో లేకపోవడంతో కాసియానో పాస్ చేసిన బంతి నేరుగా గోల్‌పోస్ట్‌లోకి వెళ్లి సెల్ఫ్ గోల్‌గా నమోదైంది. దీంతో బంతిని టచ్ చేయకుండానే ప్రత్యర్థి జట్టు నోవోరిజోంటినో ఖాతాలో ఒక గోల్ చేరింది. దీనికి సంబంధించిన వీడియోపై నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఫుట్ బాల్ క్రీడా రంగంలో ఇది అత్యంత చెత్త గోల్ అని కొందరు తెలిపారు. ఇలాంటి జట్టు ఉంటే...ప్రత్యర్థి బంతిని టచ్ చేయకుండానే గెలవచ్చంటూ మరికొందరు రెసిఫ్ జట్టుపై సెటైర్లు వేస్తున్నారు.మరోవైపు, బ్రెజిల్ ఫుట్‌బాల్ గురించిన మరో ఆసక్తికరమైన వార్త భారతీయ క్రీడాభిమానులను ఉర్రూతలూగిస్తోంది. కోల్‌కతాలో జరగనున్న భారత్-బ్రెజిల్ చారిత్రాత్మక అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్‌పై ఫుట్‌బాల్ ప్రేమికులు అమితాసక్తి కనబరుస్తున్నారు. వివేకానంద యువ భారతి క్రీడాంగణం (ఎజఃఐ) వేదికగా అక్టోబర్ 3న జరగనున్న ఈ మ్యాచ్‌కు సంబంధించిన తక్కువ ధర టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చిన గంటల వ్యవధిలోనే అమ్ముడయ్యాయి.

## వైభవ్ లాంటి ప్లేయర్‌ను ఒక్కడినైనా తయారు చేశారా?: వసీం అక్రమ్



భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై పాకిస్థాన్ మాజీ క్రికెటర్ వసీం అక్రమ్ ప్రశంసలు కురిపించాడు. ఈ క్రమంలో పాక్ క్రికెట్‌పై సంచలన విమర్శలు చేశాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్) పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. పీఎస్ఎల్‌ను ఐపీఎల్‌తో పోలుస్తూ.. యువ బ్యాటర్ల ప్రతిభను వెలికితీయడంలో పాకిస్థాన్ లీగ్ విఫలమైందని విమర్శించాడు.'పీఎస్ఎల్ ప్రారంభమై పదేళ్లు దాటింది. కానీ ఆ లీగ్ నుంచి ఒక్క బ్యాటర్ అయినా జాతీయ జట్టులోకి వచ్చాడా? కొంతమంది మంచి బౌలర్లను తయారు చేశాం. కానీ చెప్పుకోదగ్గ యువ బ్యాటర్లను ఎంత మందిని తయారు చేశాం? వైభవ్ సూర్యవంశీ లాంటి బ్యాటర్ మన దగ్గర నుంచి వచ్చినప్పుడే పాకిస్థాన్ క్రికెట్‌లోనూ మార్పు కనిపిస్తుంది. పాకిస్థాన్‌లో యువ ప్లేయర్ల ప్రతిభను వెలికి తీయాలంటే క్లబ్ క్రికెట్ వ్యవస్థను పునరుద్ధరించాలని. సుదీర్ఘ ఫార్మాట్‌లో పలు కీలక మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. కరాచీ, లాహోర్‌లో క్లబ్ క్రికెట్ అభివృద్ధికి పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఒక్కో నగరానికి రూ.10కోట్లు కేటాయించాలి. ఎందుకంటే అసలైన ప్రతిభ క్లబ్ క్రికెట్ నుంచే వస్తుంది' అని వసీం అక్రమ్ వెల్లడించాడు.పాకిస్థాన్ ప్రస్తుతం ఇంగ్లండ్‌తో మూడో టెస్టు మ్యాచ్ ఆడుతోంది. ఇప్పటికే 2-0 తేడాతో సిరీస్ ఓడిన పాక్.. మూడో టెస్టులో కూడా ఓటమి అంచున నిలిచింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి 449 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లండ్‌కు 129 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ మ్యాచ్‌లో కూడా ఓడితే పాక్.. ఇంగ్లండ్ చేతిలో వైట్ వాష్ అవుతుంది.

## భారత మాజీ క్రికెటర్ శ్రీశాంత్ ఇంట్లో విషాదం



భారత మాజీ క్రికెటర్ శ్రీశాంత్ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. అతడి తండ్రి వి.శాంతకుమారన్ నాయర్(89) కన్నుమూశారు. అనారోగ్యంతో కొచ్చిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన.. శుక్రవారం రాత్రి తుది శ్వాస విడిచారు. ప్రస్తుతం ఆయన భౌతికకాయాన్ని ఆసుపత్రి మార్చురీలో ఉంచారు. విదేశాల్లో ఉన్న బంధువులు రావాల్సి ఉండటంతో ఆదివారం మృతదేహాన్ని స్వగ్రామం కేరళలోని కోతమంగళానికి తరలించనున్నారు. రేపు సాయంత్రం 4 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.శాంతకుమారన్ నాయర్ ఎల్ఐసీలో జోనల్ మేనేజర్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఆయనకు భార్య టి.ఎన్. సావిత్రీదేవి, పిల్లలు దీపు, నివేదిత, దివ్య, శ్రీశాంత్ ఉన్నారు.

## యూఎస్ ఓపెన్: టియాఫో చిత్తు.. ఫైనల్‌కు దూసుకెళ్లిన బెన్ షెల్టన్

అమెరికా యువ టెన్నిస్ సంచలనం బెన్ షెల్టన్ యూఎస్ ఓపెన్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. క్వార్టర్ ఫైనల్‌లో టెన్నిస్ దిగ్గజం కార్లోస్ అల్కరాజ్‌ను ఓడించి సంచలనం సృష్టించిన అతడు.. సెమీఫైనల్లో తన దేశానికే చెందిన ఫ్రాన్సిస్ టియాఫోపై నాలుగు సెట్ల గేమ్‌లో విజయం సాధించాడు. ఎనిమిదో సీడ్ షెల్టన్.. టియాఫోను 4-6, 6-3, 6-3, 7-5 తేడాతో ఓడించి తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌లో అడుగుపెట్టాడు. తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ చేరేందుకు ఇద్దరు అమెరికన్లు తలపడటంతో ఈ మ్యాచ్‌పై భారీ ఆసక్తి నెలకొంది. తొలి సెట్‌లో టియాఫో ఆధిపత్యం ప్రదర్శించాడు. 5-4 వద్ద షెల్టన్ అనూహ్యంగా డబుల్ ఫాల్ట్ చేయడంతో బ్రేక్



సాధించిన టియాఫో.. ఆ తర్వాత తన సర్వీస్‌ను నిలబెట్టుకుని 6-4తో సెట్‌ను సొంతం చేసుకున్నాడు. అయితే రెండో సెట్ నుంచే మ్యాచ్ స్వరూపం మారిపోయింది. షెల్టన్ దూకుడుగా ఆడుతూ తొలి గేమ్‌లోనే బ్రేక్ సాధించి 2-0 తేడాతో ఆధిక్యంలోకి వెళ్లాడు. టియాఫో వెంటనే బ్రేక్ సాధించి స్కోరును 2-2తో సమం చేసినా.. అతడి సర్వీస్‌లో నిలకడ లేకపోవడం షెల్టన్‌కు కలిసొచ్చింది. ఎనిమిదో గేమ్‌లో మరోసారి బ్రేక్ సాధించిన షెల్టన్ 5-3 ఆధిక్యంలోకి వెళ్లి సెట్‌ను గెలుచుకున్నాడు.మూడో సెట్‌లోనూ ఆధిపత్యం షెల్టన్‌దే. ఐదో గేమ్‌లో టియాఫో సర్వీస్‌ను బ్రేక్ చేసి 3-2తో ముందంజ వేశాడు. టియాఫో తీవ్రంగా పోరాడినా షెల్టన్ ఒత్తిడికి తలొగ్గలేదు. కీలక సమయంలో అద్భుతమైన రిటర్న్‌లతో పాయింట్లు సాధిస్తూ మూడో సెట్‌నూ తన ఖాతాలో వేసుకున్నాడు. నాలుగో సెట్‌లో ఇరువురూ తమ సర్వీస్‌లను నిలబెట్టుకుంటూ సాగారు. మ్యాచ్ 12వ గేమ్‌కు చేరుకునే వరకు ఒక్కరికీ స్పష్టమైన ఆధిక్యం దక్కలేదు. అయితే కీలక సమయంలో టియాఫో సర్వీస్‌ను బ్రేక్ చేసిన షెల్టన్.. అదే ఊపులో మ్యాచ్‌ను ముగించి కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌ను ఖాయం చేసుకున్నాడు.

## సచిన్, రహానేకు మరో గౌరవం.. వాంఖడేలో ప్రత్యేక లాంజ్‌లు ఏర్పాటు..!





భారత మాజీ క్రికెటర్లు సచిన్ టెండూల్కర్ అజింక్యా రహానేలకు మరో గౌరవం దక్కనుంది. దిగ్గజ ఆటగాళ్లుగా కితాబులందుకున్న వీరి పేర్లను వాంఖడే స్టేడియంలోని లాంజ్(విశ్రాంతి గదులకు)లకు పెట్టాలని ముంబై క్రికెట్ సంఘం నిర్ణయించింది. టీమిండియాకు, ముంబై క్రికెట్‌కు విశేష సేవలందించినందున విశ్రాంతి గదులకు సచిన్, రహానే పేర్లను ఎంసీఏ ఖరారు చేసింది. వీరితో పాటు దివంగత మాధవ్ మంత్రి పేరుతోనూ లాంజ్ ఉంటుందని శుక్రవారం ఎంసీఏ తెలిపింది.ముంబై క్రికెట్ సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. శుక్రవారం జరిగిన వార్షిక సమావేశంలో మాజీ క్రికెటర్ల పేర్లను లాంజ్(విశ్రాంతి గదులకు)లకు పెట్టాలని ఎంసీకే తీర్మానించింది. దేశవాళీలో ముంబైకి ఆడిన సచిన్ టెండూల్కర్, ఇటీవలే వీడ్కోలు పలికిన అజింక్యా రహానే.. ముంబై రంజీ జట్టు మాజీ కెప్టెన్, దివంగత మాధవ్ మంత్రి పేర్లను వాంఖడే స్టేడియంలోని లాంజ్‌లకు పెట్టనుంది.సచిన్, రహానే, మాధవ్ పేర్లనే ఏ లాంజ్‌కు పెట్టాలి? వాటిని తీర్చిదిద్దేబాధ్యతను ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీకి, కార్యదర్శులకు అప్పగించామని ఎంసీఏ అధ్యక్షుడు అజింక్యా నాయక్ వెల్లడించారు. ఎంసీఏ ఉపాధ్యక్షుడు జితేంద్ర అవ్హాద్, అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు మిలింద్ నర్వేకర్, సలహాదారుడు ఉజ్వల్ నికమ్ ఈ ముగ్గురు సభ్యుల కమిటీలో ఉన్నారు. వార్షిక సమావేశంలోనే అనుబంధ క్రికెట్ క్లబ్‌లకు రిజర్వ్ మొత్తంగా రూ.100 కోట్లు కేటాయించాలని ఎంసీఏ నిర్ణయించింది.

## ఇంగ్లండ్‌తో మూడో టెస్టు.. 9 సిక్సర్లు కొట్టిన పాక్ బ్యాటర్ రజావుల్లా



బర్మింగ్‌హామ్: పాకిస్థాన్ ఆల్‌రౌండర్ రజావుల్లా సెన్సేషన్ క్రియేట్ చేశాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడవ టెస్టులో మూడో రోజు అతను పవర్ హిట్టింగ్ తడాఖా చూపించాడు. అరంగేట్రం టెస్టు ఆడుతున్న రజావుల్లా.. తొమ్మిదో నెంబర్ బ్యాటర్‌గా రెండో ఇన్నింగ్స్‌లో క్రీజ్‌లోకి దిగాడు. అసాధారణ రీతిలో 9 వికెట్‌కు అబ్బాస్‌తో కలిసి 121 రన్స్ జోడించారు. రజావుల్లా 63 బంతుల్లో 81 రన్స్ చేసి ఔటయ్యాడు. అతని ఇన్నింగ్స్‌లో 4 ఫోర్లు, 9 సిక్సర్లు ఉన్నాయి. దీంతో పాకిస్థాన్ తన రెండో ఇన్నింగ్స్‌లో 449 రన్స్‌కు ఆలౌటైంది. ఇంగ్లండ్ గెలుపు కోసం 130 రన్స్ చేయాల్సి ఉంటుంది. వాస్తవానికి మూడో రోజే పాకిస్థాన్ కుప్పకూలింది. కానీ అనూహ్య రీతిలో రజావుల్లా 9వ వికెట్ రూపంలో మెరుపులు మెరిపించాడు. భారీ సిక్సర్లతో ఆకట్టుకున్నాడు.రజావుల్లా హిట్టింగ్‌కు ఇంగ్లండ్ బౌలర్లు స్టన్ అయ్యారు. రెండో ఇన్నింగ్స్‌లో పాక్ బ్యాటర్లు షాన్ మసూద్ 95, బాబర్ ఆజమ్ 76, అజన్ అవాయిస్ 59 రన్స్ చేశారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఓ సెంచరీ చేసిన రికార్డు ఉన్న రజావుల్లా.. ఇంగ్లండ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 43 బంతుల్లో అతను హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. లీడ్స్, లార్డ్స్‌లో జరిగిన టెస్టుల్లో పాకిస్థాన్ మరీ పేలవంగా ఆడింది. బర్మింగ్‌హామ్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లోనూ 133 పరుగుల స్వల్ప స్కోరుకే చేతులెత్తేసింది. ఈ సిరీస్‌లో తొలిసారి పాక్ 200 స్కోరు దాటింది. తొలి రెండు టెస్టుల్లో ఘోర వైఫల్యం కావడంతో.. పాక్ జట్టు ఏకంగా ఏడుగురు సభ్యులను తొలగించింది.

## జూనియర్ ఆసియా కప్: ఫైనల్‌కు భారత మహిళా హాకీ జట్టు

జూనియర్ ఆసియా కప్‌లో భారత మహిళా హాకీ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీ ఫైనల్‌లో దక్షిణ కొరియాపై భారత్ 5-1 తేడాతో ఘన విజయం సాధించింది. గత మ్యాచ్‌లతో పోలిస్తే ఈసారి భారత అమ్మాయిలకు గట్టి పోటీనే ఎదురైంది. అయినప్పటికీ దక్షిణ కొరియాను భారీ తేడాతో చిత్తు చేసింది. కాగా ఈ టోర్నీలో ఇప్పటికే



పురుషుల హాకీ జట్టు ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకున్న సంగతి తెలిసిందే.భారత విజయంలో సుప్రియ కీలక పాత్ర పోషించింది. ఆమె ఏకంగా హ్యాట్రిక్ సాధించి ప్రత్యర్థిని హడలెత్తించింది. సుప్రియ మూడు గోల్స్ చేయగా.. మధు సిదార్, సుఖ్వీర్ కౌర్ చెరో గోల్ సాధించారు. దక్షిణ కొరియా తరఫున యురి జెంగో ఒక్క గోల్ చేసింది.అంతకుముందు క్వార్టర్ ఫైనల్లో పాకిస్థాన్‌ను భారత జట్టు ఏకంగా 19-0తో చిత్తు చేసింది. అదే జోరును సెమీఫైనల్లోనూ కొనసాగించింది. అయితే కొరియా కాస్త ప్రతిఘటించినప్పటికీ భారత అమ్మాయిలు ఎక్కడా ఒత్తిడికి గురి కాలేదు. ఈ విజయంతో భారత్ జూనియర్ ఆసియా కప్ టైటిల్‌కు మరో అడుగు దూరంలో నిలిచింది. మరో సెమీఫైనల్లో చైనా, జపాన్ జట్లు తలపడనున్నాయి. ఆ మ్యాచ్ విజేతతో భారత్ ఫైనల్లో టైటిల్ కోసం పోరాడనుంది.

ఇయ్యాల తెలంగాణ






# సినిమా



## మారేమ్మకు ఏ సర్టిఫికెట్ జారీ!


మాస్ మహారాజ రవితేజ ఇటీవల 'ఇరుముడి' మూవీతో కెరీర్ లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ హిట్ కొట్టారు. డివోషనల్ ప్లస్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కిన ఇరుముడి మూవీ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించింది. ఇప్పుడు రవితేజ తమ్ముడి కొడుకు మాధవ్ హీరోగా పరిచయం అవుతూ చేస్తున్న చిత్రం మారెమ్మ. ఈ మూవీ కూడా డివోషనల్ ప్లస్ థ్రిల్లర్ కాన్సెప్ట్ తో తెరకెక్కింది. ఇటీవల విడుదలైన ట్రైలర్ చిత్రంపై ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమా సెప్టెంబర్ 10వ తేదీన గ్రాండ్ గా రిలీజ్ అవుతోంది. ఈ చిత్రానికి మంచాల నాగరాజు దర్శకత్వం వహించారు. అలాగే మోక్ష ఆర్ట్స్ పతాకంపై మయూర్ రెడ్డి బండారు నిర్మించారు. మారెమ్మ చిత్రంలో మాధవ్ సరసన హీరోయిన్ గా తమిళ బ్యూటీ దీపా బాలు నటించింది. వీరితో పాటు ఈ మూవీలో వికాస్ వశిష్ట, వినోద్ కుమార్, వీఎస్ రూపాలక్ష్మి, దయానంద్ రెడ్డి వంటి వారు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇక మారెమ్మ చిత్రం ఇటీవల సెన్సార్ కార్యక్రమాల్ని పూర్తి చేసుకుంది. ఈ చిత్రం రన్ టైమ్ 2 గంటల 15 నిమిషాలు అంటే.. 135 నిమిషాలుగా ఉంది. తక్కువ రన్ టైమ్ కావడంతో సినిమా చాలా గ్రిప్పింగ్ గా ఉంటుందని తెలుస్తోంది. అనవసరమైన వాటికి పోకుండా స్ట్రెయిట్ గా పాయింట్ చెప్పే ప్రయత్నం చిత్ర యూనిట్ చేసినట్లు తెలుస్తోంది. ఇక ఈ మూవీకి సెన్సార్ బృందం ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. అంటే 18 సంవత్సరాలు నిండిన వారు మాత్రమే ఈ సినిమా చూసేందుకు అర్హులని అర్థం. ఇక మారెమ్మ సినిమా మిగతా సినిమాల మాదిరి కాదు.. గ్రామీణ నేపథ్యంలో సాగే ఓ డివోషనల్ థ్రిల్లర్ కథే ఈ సినిమా. పెంపుడు జంతువులు, మానవుల మధ్య సంబంధాలను ఈ మూవీ ద్వారా సరికొత్తగా ఆవిష్కరించే ప్రయత్నం చేశారు దర్శకుడు మంచాల నాగరాజు. వరంగల్ జిల్లాలోని మహిషాపురం అనే గ్రామంలో ఈ మూవీ స్టార్ట్ అవుతుంది. ఆ ఊరిలో ప్రమాదకరమైన వ్యాధి సోకి అంతా చనిపోతుంటారు. ప్రజలంతా భయంతో ఉన్న సమయంలో ఆ ఊరిలో ఓ దున్నపోతు జన్మిస్తుంది. అయితే దాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని ఓ జ్యోతిష్యుడు చెబుతాడు. ఆ దున్నపోతుకు మారెమ్మ అని పేరు పెట్టి దేవతగా భావిస్తారు ప్రజలు. అయితే ఆ దున్నపోతును చూసుకునే బాధ్యత పశువుల కాపరి అయిన మారి(మాధవ్ భూపతిరాజు) కు ఇస్తారు. అయితే అనుకోని సంఘటనల కారణంగా ఆ దున్నపోతు కనిపించకుండా పోతుంది. ఆ తర్వాత ఏం జరిగింది..? అనేదే స్టోరీ. డివోషనల్ ప్లస్ థ్రిల్లర్ కథాంశం కావడంతో ఈ మూవీతో మాధవ్ హిట్ కొట్టాడని సామాజిక మాధ్యమాల్లో కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇక ఫుల్ రివ్యూ కావాలంటే సెప్టెంబర్ 10 వరకు ఆగాల్సిందే.




## 'రణబాలి'లో యోధుడిగా విజయ్

విజయ్ దేవరకొండ, రాహుల్ సాంకృత్యాన్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్-ఇండియా చిత్రం 'రణబాలి'. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. 1854-1878ల నాటి బ్రిటిష్ ఇండియా నేపథ్యంలో, రాయలసీమ ప్రాంతంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాని రూపొందిస్తున్నారు. ఇందులో విజయ్ పవర్‌ఫుల్ యోధుడిగా కనిపిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ డ్రామా అక్టోబర్ 16న దసరా కానుకగా విడుదల కానుంది. వారు ఆ కథను పాతిపెట్టారు.. వారు ఆ పేరును చెరిపివేశారు. వారు తమ పాపాలను తుడిచిపెట్టారు. కానీ అతని రౌద్రాగ్నిని మాత్రం ఎప్పటికీ పాతిపెట్టలేకపోయారు. జానపద గాథలు, చరిత్ర అతన్ని ఎప్పటికీ మరువవు. రణబాలి.. ఆ యోధుడి ప్రతిజ్ఞ అని మేకర్స్ పేర్కొన్నారు. "అతిథులుగా వచ్చి, అణచివేతదారులుగా మిగిలిపోయిన వారిని. రక్తం చిందించాలని నిర్ణయించుకున్న మన గ్రామాల్లోని ఆ మనుషులను.. ఎప్పటికీ మర్చిపోవద్దు" అని విజయ్ దేవరకొండ పోస్ట్ పెట్టారు. 1854 – 1878 మధ్య కాలంలో బ్రిటిష్ ఇండియాలో రాయలసీమ ప్రాంతంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా 'రణబాలి' చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో రణబాలి అనే వీరుడిగా విజయ్ దేవరకొండ కనిపిస్తుండగా.. ఆయన భార్య జయమ్మ పాత్రను రష్మిక పోషించారు. అజయ్ – అతుల్ సంగీతం సమకూర్చగా.. నీరవ్ షా, జిష్ణు భట్టాచార్జీ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు.'రణబాలి' చిత్రాన్ని టీ-సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని ఢ వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత విజయ్ – రష్మిక కలిసి నటిస్తున్న సినిమా ఇది. భార్యాభర్తలుగా మారిన తర్వాత విరోష్ నుంచి రాబోయే తొలి సినిమా కావడంతో అభిమానులు ఎగ్జైటెడ్ గా ఉన్నారు.





## నా మానసిక ధైర్యాన్ని దెబ్బతీశాయి

సినీ పరిశ్రమలో విజయాలు ఎంత గుర్తింపు తీసుకొస్తాయో... పరాజయాలు అంతకంటే ఎక్కువ ఒత్తిడిని మోసుకొస్తాయి. ముఖ్యంగా సోషల్ మీడియా హవా నడుస్తున్న నేటికాలంలో సినిమా ఫలితం తేడా కొడితే నటీనటులపై వచ్చే ట్రోలింగ్ వారిని తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేస్తుంది. ఇలాగే హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మి తాను ఎదుర్కొన్న చేదు అనుభవాలను తాజా ఇంటర్వ్యూలో చెబుతూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా అభిలాష్ జోషి దర్శకత్వంలో సుమారు రూ.50 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ' కింగ్ ఆఫ్ కోథా ' ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. ఈ సినిమా పరాజయం తన కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితంపై చూపిన ప్రతికూల ప్రభావం గురించి ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. 2023లో భారీ హైప్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కింగ్ ఆఫ్ కోథా' బాక్సాఫీస్ వద్ద చతికిలబడటంతో పాటు, నెట్టింట తీవ్రమైన విమర్శలను ఎదుర్కొంది. చిత్ర బృందంతో పాటు తనపై వచ్చిన ట్రోలింగ్ తనను తీవ్రంగా కలచివేసిందని ఐశ్వర్య తెలిపారు. సినిమాలో తన నటన, సంభాషణలు పలికే తీరుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని, కొన్ని సందర్భాల్లో ప్రేక్షకుల విమర్శలు నిజమేనేమో అని తానూ భావించినట్లు చెప్పారు. ముఖ్యంగా దుల్కర్ పాత్రను ఉద్దేశించి తాను పలికిన 'రాజువెట్టా' అనే సంభాషణ నెట్టింట దారుణంగా ట్రోలింగ్‌కు గురైందని గుర్తుచేసుకున్నారు. ఈ నెగెటివిటీ అక్కడితో ఆగకుండా షూటింగ్ లొకేషన్లకూ పాకిందని ఐశ్వర్య గుర్తు చేసుకున్నారు. 'హలో మమ్మీ' సినిమా షూటింగ్ సమయంలో ఒక అసిస్టెంట్ డైరెక్టర్ తనను ఉద్దేశపూర్వకంగా ఆ పేరుతో పిలిచి గేలి చేయడంతో తీవ్రంగా మనస్తాపం చెందినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సినిమా తెచ్చిన ప్రతికూల ప్రభావంతో మలయాళ చిత్ర పరిశ్రమలో దర్శకనిర్మాతలు తనకు కొత్త అవకాశాలు ఇచ్చేందుకు వెనుకాడేవారని పేర్కొన్నారు. ఈ ట్రోల్స్ తెచ్చిన భయం ఎంతవరకు వెళ్లిందంటే, ఆ తర్వాత దుల్కర్ సల్మాన్‌తో కలిసి ఒక కమర్షియల్ యాడ్‌లో నటించే అవకాశం వచ్చినా ఆమె రిజెక్ట్ చేశారట. 'నేను ఆయనతో నటిస్తే మళ్లీ ట్రోలింగ్ మొదలై మీ ప్రాజెక్ట్‌కే ఇబ్బందిగా మారుతుంది' అని చెప్పి మరీ ఆ ఆఫర్‌ను వదులుకున్నానని, ఈ చేదు అనుభవం వల్ల దుల్కర్‌తో మళ్లీ కలిసి పనిచేయగలనా అనే సందేహం కలుగుతోందని ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. గత చేదు జ్ఞాపకాలను అధిగమిస్తూ ప్రస్తుతం ఐశ్వర్య లక్ష్మి ఇతర పరిశ్రమల్లో బలమైన ముద్ర వేస్తున్నారు. తమిళంలో ఇటీవల 'గట్ట కుస్తీ-2'తో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ఆమె, తెలుగులో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా ఎదుగుతున్నారు.





## నేడు ప్రేక్షకుల ముందుకు రానున్న 'మండాడి'




సుహాస్, సూరి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన మోస్ట్ అవైటెడ్ యాక్షన్ డ్రామా 'మండాడి' నేడు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్‌పై మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంపై ఇప్పటికే సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మహిమా నంబియార్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ కీలక పాత్రలు పోషించారు. తెలుగు రాష్ట్రాల్లో మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్పి ఈ సినిమాను అత్యంత భారీ ఎత్తున విడుదల చేస్తోంది. తాజాగా ఈ చిత్ర సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెన్సార్ బోర్డ్ ఈ సినిమాకి యూ/ఎ సర్టిఫికెట్ జారీ చేసింది. మూవీ చూసిన సెన్సార్ టీం సభ్యులు అద్భుతంగా వచ్చిందని అభినందించారు. ముఖ్యంగా ఇందులో వచ్చే బోట్ సీక్వెన్స్ ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నాయని, థియేటర్లలో ప్రేక్షకులను సీట్ ఎడ్జ్‌లో కూర్చోబెట్టడం ఖాయమని కొనియాడారు. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, మైండ్ బ్లోయింగ్ ట్రైలర్ సినిమాపై హైప్‌ను రెట్టింపు చేశాయి. మ్యూజిక్ సెన్సేషన్ జీ.వి. ప్రకాష్ కుమార్ అందించిన నేపథ్య సంగీతం సినిమాని మరో స్థాయికి తీసుకెళ్లింది. ఎస్.ఆర్. కథిర్ విజువల్స్ ప్రతి ఫ్రేమ్‌ను ఎంతో గ్రాండ్‌గా, విజువల్ ఫీస్ట్‌లా మలిచాయి.పీటర్ హెయిన్, దిలీప్ సుబ్బురాయన్, మహేష్ మాథ్యూ కంపోజ్ చేసిన యాక్షన్ సీక్వెన్సులు మాస్, యాక్షన్ ప్రియులను థ్రిల్ చేయనున్నాయి. స్టార్ డైరెక్టర్ వెట్రిమారన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించడం ఈ ప్రాజెక్ట్‌కి బలాన్ని చేకూర్చింది.

Edited, Printed, Published and Owned by KASHAPAGA SAHITYA, and Printed at THANMAYEE PRINTERS, D.No. 17-2-539,Shop No.7&8,Saidabad,Hyderabad,Telangana and Published at: H.No. 18-7-731, Gowlipura, Chatrinaka, Hyderabad-500053, Telangana.Editor: KASHAPAGA SAHITYA. "RNI No.TELTEL/2015/64243. Cell:7671859219 E-mail Id: iyyalatelangana@gmail.com